
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 12 మార్చి 2024



సోమశిలలో 13.650 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, మార్చి 11: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి జలాశయంలో 13.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

పరీక్షల వేళ.. ఆరోగ్యం పదిలం !



ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలవుతుంది. తీవ్ర ఒత్తిళ్ల నేపథ్యంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడం కోసం దృష్టి కేంద్రీకరించే విద్యార్థులు ఆహారం తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో చదువుపై ఆసక్తి తగ్గిపోయి లక్ష్యం నీరుగారిపోతుంది. విద్యార్థుల చదువుతోపాటు తీసుకునే ఆహారంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో పది విద్యార్థుల కోసం అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు (విద్య)

ఆహారం, నిద్ర ముఖ్యం...




పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు. చదివిన అంశాలు గుర్తు ఉండాలంటే నిద్రకు ఏడు లేదా ఎనిమిది గంటల సమయం కేటాయించాలి. విద్యార్థులు ఇడ్లీ, పెరుగన్నం, అరటి పండ్లు, క్యారెట్, పాలు ఎక్కువగా తీసుకుంటే మంచిది. నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి. పరీక్షలకు ముందు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ గంగాధర్, ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్

మంచి మార్కులు సాధించే క్రమంలో తమ చిన్నారులు తిండిపై కూడా ధ్యాసలేకపోవడంతో ఫలితాలపై ఆ ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పదోతరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 30వేల మంది పరీక్షకు హాజరవుతున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు తెలియని భయానికి గురై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారంపై శ్రద్ధ, సరైన నిద్రలేక ఏకాగ్రత కోల్పోతుంటారు. ఈ క్రమంలో ఒత్తిడికి గురికాకుండా సమయానికి సాత్విక ఆహారం తీసుకుంటూ బాగా నిద్రపోతే జ్ఞాపకశక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటిస్తే మరింత ఉత్సాహాన్ని సొంతం చేసుకోవచ్చని వారు అభిప్రాయ పడుతున్నారు.

● సమస్యలకు చెక్...

ఒత్తిడి సమస్యతో బాధపడే విద్యార్థులు ముందు ప్రశాంతంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షలు రాయడమే తప్ప పాస్, ఫెయిల్ గురించి ఆలోచించవద్దంటున్నారు.మార్కుల గురించి పట్టించుకోవద్దని, వచ్చిన అంశాలను పేపర్‌పై ప్రజెంట్ చేయడంపైనే దృష్టి సారించాలంటున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో కొత్త అంశాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపించవద్దని, ఇప్పటికే చదివిన పాఠ్యాంశాలనే పునరుశ్చరణ చేసుకోవాలని చెబుతున్నారు. పిల్లలు ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని, మార్కులు, టార్గెట్‌లు అసలు పెట్టవద్దని సూచిస్తున్నారు. అలాగే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగా, మెడిటేషన్ చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని తెలియ చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లకు అలవాటుపడిన విద్యార్థులు పరీక్షలు పూర్తయ్యే వరకు వాటి జోలికి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.



● ఆహారం ఇలా...

● చదివేటప్పుడు విద్యార్థులు ఒత్తిడికి గురికావడంతో కడుపులో మంట వస్తుంది. రాత్రిపూట ప్రతిరోజూ పెరుగన్నం తీసుకుంటే బాగుంటుంది.

● పచ్చి క్యారెట్‌ను నియమితంగా తినడం వల్ల విటమిన్-ఏ లభిస్తుంది. పుస్తకాలు చదివే సమయంలో కళ్లు మంటలు పుడుతుంటాయి. దీని నుంచి విద్యార్థులు బయటపడాలంటే క్యారెట్‌ను తీసుకోవాలి.

● ఉదయం ఇడ్లీ తినడం వల్ల విద్యార్థులకు కార్బోహైడ్రేట్స్ లభిస్తాయి. అది జీర్ణం కావడం వల్ల గ్లూకోజ్‌గా మారి శక్తి లభిస్తుంది.

● అరటిపండ్లు తినడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

● విద్యార్థులు ఒత్తిడికి గురికావడంతో చెమటలు పడతాయి. ఇలాంటి విద్యార్థులు నీటిని ఎక్కువగా తాగాలి.

● పరీక్షల సమయంలో కొవ్వు పదార్థాలు, నూనె వస్తువులు, మాంసాహారాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలి.

● తీసుకునే ఆహారం పరిమాణం తగ్గించాలి. నిద్రపోయే ముందు పాలు తాగాలి.

● పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి యోగా చేయాలి.

● జామ, అరటి, ఆపిల్ వంటి పండ్లను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ బాగుంటుంది. ఆరోగ్యపరంగా అవి విద్యార్థికి ఎంతగానో ఉపయోగపడతాయి.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.28
సహరి (బుధవారం) : 4.53



విద్యుత్ దీపాల వెలుగులో నెల్లూరు కోటమిట్ట మసీదు

● నెలవంక కనిపించడంతో ముస్లింల సంబరాలు



నెల్లూరు (సాంస్కృతికం): రంజాన్ మాసం ప్రారంభ సూచికంగా సోమవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించింది. దీంతో జిల్లావ్యాప్తంగా ముస్లింలు సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభా కాంక్షలు తెలుపుకున్నారు. మరికొందరు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. రాత్రి అన్ని మసీదుల్లో అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ప్రత్యేక దువా చేశారు. మంగళవారం తెల్లవారుజామున సహరీతో రంజాన్ ఉపవాస దీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు.

వేసవి అలవెన్సులు ఏవి ?

● వేతనాలూ ఆలస్యమే..! ● ఉపాధి హామీ పనులపై కూలీల నిరాసక్తి
● రోజురోజుకూ నీరుగారుతున్న పథకం

సంగం, మార్చి 11 : గ్రామాల్లో వలసలు నివారించి, పేదలకు ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజురోజుకూ నీరుగారుతోంది. గతంలో పనికి వెళ్తే వేతనాలు వెంటనే పడేవి. ప్రస్తుతం పనిచేసిన ఐదారు వారాలకు కూడా వేతనాలు పడడంలేదు. అంతేకాక పనికి తగ్గ కూలి రాకపోవడంతో ఉపాధి హామీ పనులపై కూలీలు ఆసక్తి కనపరచడం లేదు. ఎండాకాలం వచ్చిందంటే వేసవిభత్యం కింద 20 శాతం నుంచి 30 శాతం అదనంగా ఇచ్చేవారు. వేసవిలో నేల గట్టిగా ఉంటుంది. పనిజరగదు. ఎక్కువ సమయం పనిచేయలేరు. దీంతో కూలి గిట్టుబాటు అయ్యేది కాదు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరిలో 20 శాతం మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 అదనంగా కూలి ఇచ్చేవారు. దీంతో పని తక్కువగా జరిగినా కూలి గిట్టుబాటు అయ్యేది. రెండేళ్ల వరకు ఈ విధానం ఉండేది. కానీ ప్రస్తుతం వేసవి అలవెన్సు నిలిపివేశారు. కూలి రూ. 270లకు పెంచినా వేసవిలో ఆ మేరకు గిట్టుబాటు కావడం లేదని కూలీలు అంటున్నారు.

● ఇతర అలవెన్సులకు మంగళం

గతంలో పరికరాలకు అలవెన్సుల కింద అదనంగా సొమ్ములు ఇచ్చేవారు. గడ్డపారకు రూ. 10, మంచినీటికి రూ.5 వేసవి అలవెన్సులుగా ఉండేవి. రెండేళ్లుగా అవి కూడా రావడం లేదని కూలీలు అంటున్నారు. కనీసం పనిచేసే సమయంలో ఏ చిన్న గాయమైనా ఫస్ట్ ఎయిడ్ చేసుకోవడానికి కిట్లు ఇచ్చేవారని, అవి కూడా ఇప్పుడు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో టెంట్‌లు ఏర్పాటు చేయడంతోపాటు మజ్జిగ పంపిణీ కూడా లేదంటున్నారు. ఉదయం. 7 నుంచి మధ్యాహ్నం 11-00 గంటల వరకు మండుటెండలో పనిచేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలవెన్సులు సరిగా రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవిలో అలవెన్సులతోపాటు పరికరాలు, పని చేసేచోట తాగునీటి, నీడకు టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు వంటి సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎన్నికలకు యంత్రాంగం సిద్ధం !

● ఏర్పాట్లన్నీ పూర్తి... నోటిఫికేషనే తరువాయి
● కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక
● జిల్లాకు చేరుకున్న కేంద్ర బలగాలు
● ఈవారంలో ఈసీ ప్రకటన వస్తుందని అంచనా

నెల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. పోలింగ్ కేంద్రాల నుంచి సిబ్బంది వరకు అంతా సిద్ధమయ్యారు. జిల్లాలోని పరిస్థితులపై ఉన్నతాధికారులు ఎన్నికల కమిషన్‌కు నివేదికను అందజేశారు. ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడమే మిగిలింది. ఈ వారంలోనే ఈసీ ప్రకటన వెలువడుతుందని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగానే కేంద్ర భద్రతా బలగాలు కూడా జిల్లాకు చేరుకున్నాయి.

● 2,317 పోలింగ్ కేంద్రాలు సిద్ధం

సార్వత్రిక ఎన్నికలు - 2024కు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,317 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అత్యధికంగా కోవూరు నియోజకవర్గంలో 324, ఉదయగిరిలో 323 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ కేంద్రాల్లో పోలింగ్‌కు అనువుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణం, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడం, వెబ్‌కాస్టింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు. గతంలో వివాదాలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేశారు. ఈ కేంద్రాల్లో పరిస్థితులను బట్టి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. ఇప్పటికే ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి కాగా, పోలింగ్ సిబ్బందికి కూడా పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. వివిధ స్థాయిల ఉద్యోగులకు ఎన్నికల విధులు కేటాయిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చారు. కొంత మంది సిబ్బందిని రిజర్వులో ఉంచారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఈ సిబ్బంది వారికి కేటాయించిన విధులు చేపట్టేలా ఆదేశాలి చ్చారు. ఉన్నతాధికారులు నిరంతరం ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందితో సమీక్షిస్తున్నారు..



వీకర్ సెక్షన్ ఉన్న కాలనీలకు సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వోలు, పోలీసు సిబ్బందిని పంపి ఓటర్ల సమస్యలు తెలుసుకుంటు న్నారు. ఓటు వేయడానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా- అన్న వివరాలను తెలుసుకొని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళుతున్నారు.

● జిల్లాకు కేంద్ర బలగాలు

2019 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కూడా గతంలో మార్చి 10న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ దఫా కూడా నోటిఫికేషన్‌ను ఈవారంలోనే ప్రకటిస్తారని అంచనా వేస్తున్నారు. ఈనెల 15వ తేదీలోపు ఇద్దరు కేంద్ర ఎన్నికల కమిషనర్లను నియమించేందుకు ప్రధాని నేతృత్వంలోని కమిటీ రాష్ట్రపతికి సిఫార్సు చేయనుంది. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత ఎన్నికల మాదిరిగానే ఈ దఫా కూడా మొదటి విడతలోనే రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశ ముందని ప్రచారం జరుగుతోంది. కేంద్ర భద్రతా బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకోవడం ఇందుకు బలాన్ని చేకూరు స్తోంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) సిబ్బంది 200 మంది ఇప్పటికే జిల్లాలో రిపోర్ట్ చేసుకున్నారు. మరికొంతమంది కూడా త్వరలోనే వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం బూత్ లెవల్‌లో ఏజెంట్లను నియమించుకున్నాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ 2,263 మందిని, వైసీపీ 2,225 మంది బీఎల్‌ఏలను నియమించుకున్నాయి. ఆ వివరాలను కూడా జిల్లా అధికా రులు ఎన్నికల కమిషన్‌కు పంపారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 19,13,549 మంది ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. నోటిఫికేషన్ వచ్చే వరకు కొత్త ఓట్లను చేర్చడంతో పాటు అభ్యంత రాలు కూడా స్వీకరించనున్నారు.



నెల్లూరులోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లినేని వెంకటరామారావు

పదవులు కాదు.. పార్టీ ముఖ్యం !

● అధినేత ఆదేశానుసారం నడుచుకుంటా..
● ఉదయగిరిలో టీడీపీ విజయానికి కృషిచేస్తా..
● ముఖ్యనేతల సమావేశంలో బొల్లినేని

నెల్లూరు, మార్చి11(ఆంధ్రజ్యోతి): తనకు పదవులు ముఖ్యం కాదని, టీడీపీయే ముఖ్యమని, అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఉదయగిరిలో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఉదయ గిరి నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. వారినుద్దేశించి రామారావు మాట్లాడుతూ ఉదయగిరి టికెట్ విషయంలో తనకు మాటమాత్రమైనా చెప్పలేదనే బాధతో కొద్ది రోజులు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నానని, అయితే ఏ కారణాలతో ఉదయగిరి టికెట్ ప్రకటించాల్సి వచ్చిందో ఆదివారం పార్టీ అధినేత వివరిం చడంతో ఆ బాధ తొలగిపోయిందన్నారు. తన మీద అభి మానంతో నియోజకవర్గ నాయకులంతా సమావేశానికి హాజరు కావడం సంతోషమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు, మన పిల్లల భవిష్య త్తును దృష్టిలో ఉంచుకొని టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరం అని ప్రజలు ఇప్పటికే గుర్తిం చారని, వారిని మరింత చైతన్యపరిచి ఓటింగ్ వరకు తీసుకొచ్చే బాధ్యతను గ్రామ, మండల స్థాయి నాయకులు తీసుకోవాలని బొల్లినేని కోరారు. తనకు టికెట్ రాలేదనే ఆవేదనతో ఎవరూ ఎన్నికలకు దూరంగా ఉండ వద్దని, అందరం కలిసి ఉదయగిరిలో టీడీపీని గెలిపించుకుని చంద్ర బాబుకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందామని ఆయన నేతలను కోరారు. ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందింది టీడీపీ పాలనలోనే అనే విషయాన్ని ప్రజలకు మరోసారి గుర్తు చేయాల న్నారు. నియోజకవర్గానికి జాతీయ రహదారులు తీసుకొచ్చామని, రోడ్లు, వంతెనలు, చెక్‌డ్యాంలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ విషయా లను ప్రజలకు గుర్తు చేసి టీడీపీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. సమావేశం అనంతరం మండల వారీగా నాయకులతో రామారావు వేర్వేరుగా సమావేశమై ఎన్నికల వ్యూహంపై చర్చించారు.

బొల్లినేనికి ఘన సన్మానం

బొల్లినేని వెంకట రామారావును టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. గజమాలతో, పూల బొకేలతో ముంచెత్తారు. ఆయనతో ఫొటోలు దిగడానికి పలువురు ఎగబడ్డారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకుడు పీ చెంచల్‌బాబు యాదవ్‌తోపాటు ఎనిమిది మండలాలకు చెందిన టీడీపీ ముఖ్యనాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల నిర్వహణపై చర్చించుకున్నారు.

బీద రవిచంద్రతో వేమిరెడ్డి భేటీ



బీద రవిచంద్ర దంపతులతో భేటీ అయిన వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 11 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బీద జ్యోతి దంపతులను నగరంలోని వారి నివాసంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో నెల్లూరు టీడీపీ చేనేత విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం చేనేత విభాగం కన్వీనర్ ఆశం సురేష్, నాయకులు యర్రా ధనుంజయ్, పులి సురేష్, తాళ్ల నరసింహ స్వామి, కన్నా బ్రహ్మయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, వీపీఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో టీడీపీ మహిళా విభాగం నెల్లూరు పార్ల మెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి కలిశారు. కోమరి విజయమ్మ, అధికార ప్రతినిధి మంగమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీదేవి, ప్రమీలమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగం, మార్చి 11: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఓ గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు సంగం బస్టాండ్ సెంటర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు 108కి సమాచారం అందిచడంతో వారు బాధితున్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మృతుడి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 9440796331 కు సమాచారం తెలియజేయాలని కోరారు.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



జలదంకి, మార్చి 11: మండలంలోని అన్నవరంకు చెందిన కొమరా మల్లికార్జున(40) పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో కటుంబసభ్యులు వచ్చి మల్లికార్జున మృతదేహాన్ని చూసి శోకసముద్రంలో మునిగిపోయారు. ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పొలాల్లోకి వెళ్లిన ఆయన ఎందుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చెట్టుకు ఉరి వేసుకున్న కొమరా మల్లికార్జున

కారు - మోటారు బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వరికుంటపాడు, మార్చి 11: కారు - మోటారుబైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు నుంచి జాతీయ రహదారిపై దుత్తలూరు వైపు వెళ్తున్న కారు తహసీల్దారు కార్యాలయ సమీపంలో మోటారుబైక్‌ను ఢీకొంది. దీంతో మోటారుబైక్‌పై ప్రయాణిస్తున్న వరికుంటపాడుకు చెందిన బిరుదురాజు సుబ్బరాజు, కాకి హరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను స్థానిక వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి పరారైన కారు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు

వరికుంటపాడు, మార్చి 11: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమీప కనియంపాడు పిల్లాపేరు వాగులో నుంచి ప్రతి నిత్యం ప్రకాశం జిల్లా పామూరుకు జాతీయ రహదారి మీదుగా ఇసుకను అక్రమంగా వ్యాపారులు తరలిస్తున్నారు. దీంతో నిఘా ఉంచిన ఎస్ఐ తిరు పతయ్య సిబ్బందితో కలిసి మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

నాటుబాంబు పేలి కుక్క మృతి



నాటుబాంబు కొరకడంతో తునాతునకలైన కుక్క తల

ఉదయగిరి, మార్చి 11: నాటు బాంబు పేలి కుక్క మృతిచెందిన సంఘటన ఉదయగిరి పట్టణం కృష్ణమందిరం ఆనకట్ట సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పాఠశాల సమీపంలో ఉన్న కంపచెట్లలో గుర్తు తెలియని వ్యక్తులు అడవిపందుల కోసం నాటుబాంబులు ఏర్పాటుచేశారు. అటు వైపుగా వెళ్లిన కుక్క దానిని కొరకడంతో గట్టి శబ్దంతో పేలి కుక్క అక్కడికక్కడే మృతిచెందింది. సమీపంలో ఉన్నవారు వెళ్లి పరిశీలించగా బాంబు పేలి కుక్క మృతి చెంది ఉండడాన్ని గమనించారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

ఉలవపాడు, మార్చి 11 : మండలంలోని చాగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై బాజీరెడ్డి కథనం మేరకు.. ప్రకాశం జిల్లా మార్టూరు మండలం కే రాజుపాలెం గ్రామానికి చెందిన నువ్వుల సాయితేజ (23) తన స్వగ్రామం నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో చాగొల్లు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి మామిడి చెట్లకు పురుగు మందు పిచకారి చేసేందుకు ట్యాంకర్‌లో నీరు నింపుకొని ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో సాయితేజ రోడ్డుపై పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచం అందుకుని సంఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ ప్ర మాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6304
వెండి కిలో ధర	రూ. 74,900
వెండి ఒక గ్రాము	రూ. 76.90

మోటార్ బైక్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మార్చి 11: మోటార్ బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని తాటిపర్తిపాళెం రైల్వేగేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రమేష్, అశోక్ ఇద్దరూ మోటార్‌బైక్‌పై పంటపాళెం వద్ద ఉన్న ఆయిల్ కంపెనీల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా తాటిపర్తిపాళెం రైల్వే గేటు దాటగానే గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరిని సర్వేపల్లిలోని ఒక ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు



కేవీకేలో జరిగిన శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న తిరుపతి, గుంటూరు, నెల్లూరుకు చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 11 : జిల్లాలో వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలని తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ సీ రమణ సూచించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సోమవారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం, జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక తను ఎప్పటికప్పుడు రైతులకు చేరువ చేయాలన్నా రు. మరో అతిథి, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బీ ముకుందరావు మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి అవసరమైన పద్ధతులను రైతులకు చేరువగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో నిర్వహించిన వివిధ పరిశోధనలు, ప్రదర్శనలు, పథకాలు, విస్తరణ కార్యక్రమాల ఫలితాలను విశ్లేషించారు. 2024-25లో నిర్వహించాల్సిన విస్తరణ కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి, వ్యవసాయ పరిశోధనా స్థానాల అధిపతులు డాక్టర్ ఓ వెంకటేశ్వర్లు, యు వినీత, డాక్టర్ కరీముల్లా, తిరుపతి, గుంటూరు, నెల్లూరుకు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆదర్శ రైతులు, సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘోరంగా కాకాణి నేరాలు

● నేను పెట్టిన కేసులో తప్పించుకోలేరు : సోమిరెడ్డి

నెల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి నేరాలు అత్యంత ఘోరంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. సోమిరెడ్డికి విదే శాల్లో ఆస్తులు న్నాయంటూ కాకాణి విడుదల చేసిన నకిలీ డాక్యుమెంట్లపై సోమిరెడ్డి జిల్లా కోర్టులో దాఖలు చేసిన పరువు నష్టం దావా సోమవారం విచారణకు వచ్చింది. ట్రయిల్ మొదలవగా సోమిరెడ్డి తన స్టేట్‌మెంట్‌ను కోర్టుకు సమర్పించారు. అనంతరం కోర్టు వెలుపల మీడియాతో మాట్లాడారు. తనను, తన కుటుంబాన్ని మానసికంగా, రాజకీయంగా, ఆరోగ్య పరంగా దెబ్బతీయాలనే కుట్రతో మంత్రి కాకాణి నకిలీ డాక్యు మెంట్లు సృష్టించారని ఆరోపించారు. ఎనిమిదేళ్ల తర్వాత పరువు నష్టం దావా ట్రయిల్ మొదలైందని చెప్పారు. ఈ నెల 15న మరికొన్ని డాక్యుమెం ట్లను మార్కింగ్ చేయ నున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలోని ప్రత్యేక కోర్టులో క్రిమినల్ కేసుకు సంబంధించి విచారణ ప్రారంభం కానుందని వెల్లడించారు. ఎంతో మంది ఉసురుపోసుకున్న కాకాణి ఈ కేసుల్లో తప్పించుకోలేరని సోమిరెడ్డి స్పష్టం చేశారు. 2014 ఎన్నికల సమయంలో కల్తీ మద్యం పంచి ఏడుగురు అమా యకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. కాకాణిలాగా నీచమైన, హీనమైన ఆలోచనలను చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ చేయలేదని మండిపడ్డారు.

ఇంటర్ పరీక్షలకు 21,335 మంది హాజరు

నెల్లూరు (విద్య), మార్చి 11 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జనరల్ మ్యాథ్స్-2బీ, జువాలజీ-2, హిస్టరీ-2తోపాటు ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 81 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్ విద్యార్థులు 20,510 మందికిగాను 20,188 మంది హాజరుకాగా 322 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 1,244 మందికిగాను 1,147 మంది హాజరుకాగా 97 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 21,754 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 21,335 మంది హాజరయ్యారు. 419 మంది గైర్హాజరయ్యారు. 42 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ పరిశీలించారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 11 : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 12 కేజీబీవీలు ఉండగా, ఒక్కొక్క దానిలో 40 చొప్పున ఆరో తరగతికి మొత్తం 480 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ 480 సీట్లు భర్తీ చేస్తున్నామన్నారు. వీటితోపాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా పూర్తిస్తామ ని, ఆసక్తి కలిగిన వారు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు సమీపంలోని కేజీబీవీ ప్రధానోపాధ్యాయులనుగానీ, 9908837107, 9390395563 నెంబర్లనుగానీ సంప్రదించాలని కోరారు.

హోరాహోరీగా టీ-20 క్రికెట్ లీగ్ పోటీలు

నెల్లూరు (విద్య), మార్చి 11 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రొఫెసర్ టీవీ రమణ మెమోరియల్ టీ-20 క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్స్‌లో ఎన్‌యూసీసీ, ఏఎల్ఎంసీసీ జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్‌యూసీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన ఏఎల్ఎంసీసీ జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 149 పరుగుల మాత్రమే చేసింది. దీంతో విజేత ఎన్‌యూసీసీ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఇక, రెండో సెమీఫైనల్స్‌లో ఎల్‌సీసీ జట్టు, జీఎస్ఆర్ సీసీ జట్టు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసిన ఎల్‌సీసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జీఎస్ఆర్ సీసీ జట్టు 139 పరుగులకే ఆలౌట్ అయింది. ఈనెల 17వతేదీ ఉదయం 10 గంటలకు ఎన్‌యూసీసీ, ఎల్‌సీసీ జట్లు ఫైనల్స్‌లో తలపడనున్నాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధ్యక్షుడు సీవీఎస్ మూర్తి, మాజీ కార్యదర్శి డీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

సిద్ధం సభ ముగిసినా ప్రయాణికులకు తప్పని తిప్పలు



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

ఉదయగిరి రూరల్, మార్చి 11: సిద్ధం సభ ముగిసినా ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. ఆదివారం జరిగిన సిద్ధం సభకు ఉదయగిరి డిపో నుంచి 28 బస్సులను శనివారం వివిధ ప్రాంతాలకు తరలించారు. కాగా, సిద్ధం సభ ముగిసిన అనంతరం ట్రాఫిక్, ఇతరత్రా సమస్యలతో అవి రాత్రికి డిపోకు చేరుకోలేదు. దీంతో సోమవారం ఉదయం అరకొరగా బస్సు సర్వీసులు నడవడంతో ప్రయాణి కులు అవస్థలు పడ్డారు. గంటల తరబడి వేచి ఉన్నా బస్సులు రాకపోవడంతో అరకొరగా వచ్చిన బస్సుల వద్ద ప్రయాణికులు బారులుతీరారు. కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

● 'స్పందన'లో కలెక్టర్ హరినారాయణన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 11 : జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో స్పందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. అవసరమైతే వ్యక్తిగతంగా తనిఖీ చేసి అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా పరిష్కారం ఉండాలని సూచించారు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

● ఎంపీ లాడ్స్, మున్సిపల్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరుతూ టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్‌ఖాన్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. నెల్లూరులోని వెంగళరావు నగర్ ముస్లిం శ్మశాన వాటికలో ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి స్వంత నిధులతో 2016లో నిర్మాణాలు చేయించారన్నారు. అయితే వైసీపీకి చెందిన ప్రస్తుత రూరల్ ఇన్‌చార్జి ఆ శ్మశాన వాటిక పనులను మళ్లీ ప్రారంభించారన్నారు. ఇందుకు ఎంపీ లాడ్స్, మున్సిపల్ జనరల్ ఫండ్స్ వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఆ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.

వీఆర్ విద్యాసంస్థలను కాపాడండి

నెల్లూరు (విద్య): నెల్లూరులోని చారిత్రక వీఆర్ విద్యాసంస్థలను పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. ఆ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర మాట్లాడుతూ వీఆర్ విద్యాసంస్థల్లో ఆగిపోయిన అడ్మిషన్ల ప్రక్రియను పునఃప్రారంభించాలని కోరారు. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి విద్యాసంస్థకు కమిటీ ఏర్పాటు చేసి తద్వారా కళాశాలలను నడిపించాలని, ఎయిడెడ్‌లోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనే ప్రభుత్వ సంస్థకు వీఆర్ విద్యాసంస్థలను అప్పగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కే అఖిల్, సిద్దు పాల్గొన్నారు.

నెల్లూరు, ప్రకాశం అధ్యాపకులకు శిక్షణ

నెల్లూరు (విద్య), మార్చి 11 : నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల నోడల్ రీసోర్స్ సెంటర్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన జంతు శాస్త్ర, జీవ సాంకేతిక శాస్త్ర, జీవరసాయన శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ అధ్యాపకులు ఆయా సబ్జెక్టుల్లో నూతన అంశాలను, బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ప్రయోగాత్మకమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులందరూ ఈనెల 16వతేదీ వరకు నిత్యం హాజరై ఆయా అంశాలపై శిక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, రీసోర్స్ పర్సన్లు డాక్టర్ శ్రీరం జని, డాక్టర్ ఎస్ ప్రియాంక, డాక్టర్ ఎం గురుశేఖర్, పీఆర్వో జోజి పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణం!

● నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం



కావలి : జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో సముద్రంలోకి వేసిన రోడ్డు

కావలి, మార్చి 11: బోగోలు మండలం జువ్వలదిన్నెలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్నాయి. అయినా మంగళవారం దానిని సీఎం జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.288 కోట్ల మంజూరు చేశారు. బ్లూ రెవల్యూషన్, సాగరమాల పథకముల కింద మారిటైం బోర్డు పర్యవేక్షణలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు చేపట్టారు. అయితే నిర్మాణ పనులకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఆ పనులను మధ్యలో నిలిపేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండడంతో పనులు పూర్తికాని ఫిషింగ్ హార్బర్‌ను ప్రారంభించేందుకు హడావుడి చేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాలకు ప్లాస్టింగ్ చేసి సున్నం కొట్టి మిగతా పనులన్నీ వదిలేసి ప్రారంభోత్సవం చేస్తున్నారు. అక్కడ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటమే కాక విద్యుత్ సరఫరా ఇవ్వకుండా, మంచి నీటి వసతులు కల్పించకుండా, పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం చేపట్టకుండా ప్రారంభం చేసి వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించామనిపించేందుకు మ..మ అనిపిస్తున్నారు. సీఎం వర్చువల్‌గా ప్రారంభం కూడా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద కాకుండా బోగోలు ఎమ్పీడీవో కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ షామియానా వేసి సీఎం ప్రసంగం, ప్రారంభోత్సవాలను స్ర్కీన్ ద్వారా ప్రజలకు తెలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా హార్బర్ వద్ద ఆ కార్యక్రమం పెడితే ఇంకా పూర్తి కాకుండానే ప్రారంభోత్సవం ఏమిటంటారని దానికి మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. హార్బర్ వాడుకలోకి రాకుండా ప్రారంభించితే ప్రయోజనం ఏమిటని మత్స్యకారులు అంటున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్‌ను మంగళవారం సీఎం వర్చువల్‌గా ప్రారంభిచనున్న నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ సోమవారం పరిశీలించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న సమయానికి జువ్వలదిన్నె పరిసర ప్రాంతాల తీరప్రాంత మత్స్యకారులతో సహా అధికారులతో కలసి ఎల్ఈడీ స్ర్కీను, వేదిక, వీక్షకులకు కుర్చీల ఏర్పాట్ల విషయం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రసారాన్ని అందరూ చూసేందుకు అనువుగా తాత్కాలిక హాల్ నిర్మాణంలో ఏర్పాటు చేయాలని కావలి ఆర్డీవో శీనానాయక్‌కు సూచించారు. ప్రత్యక్ష ప్రసారంలో స్థానిక మత్స్యకారుల అభిప్రాయాలను తెలియచేసేందుకు కావల్సిన ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట జేసీ సేతుమాధవన్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరావు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, తహసీల్దారు వెంకటరత్నం, ఎంపీడీవో జమీఉల్లా, రూరల్ సీఐ నాగభూషనం, ఏవో గోవిందరావు ఉన్నారు.

కావలి బరిలో జైభారత్ పార్టీ

● పోస్టర్ ఆవిష్కరణ



జైభారత్ పార్టీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ బాధ్యులు

కావలి, మార్చి 11: ఉన్నత విద్యావంతుడు, పోలీస్‌శాఖలో అత్యున్నత పదవులు నిర్వహించి సమాజంలో మార్పు కోసం జేడీ లక్ష్మీనారాయణ జైభారత్ పార్టీని స్థాపించారని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి మాకినేని అరుణ, కావలి అభ్యర్థిగా పోటీ చేయనున్న ముప్పసాని నరేంద్ర, ఆంధ్ర, తెలంగాణా యూత్ ప్రెసిడెంట్ ఎస్. సిద్దూ తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమావారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మట్లాడుతూ మంచి ఆశయాలతో స్థాపించిన జైభారత్ పార్టీని ఆదరించి కావలిలో ఆ పార్టీ తరుపున పోటీయనన్ను అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. జైభారత్ పార్టీ ప్రజల నుంచి పుట్టుకొచ్చిన పార్టీ అన్నారు. లక్ష్మీనారాయణ ఆశయాలను చూసి యువతతోపాటు ప్రజలు ఆ పార్టీని బలపరిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతోందన్నారు. అవినీతి, డ్రగ్స్, రౌడీయిజం, కాలుష్యం లేని రాష్ట్రంగా తీర్చుదిదుతామన్నారు. కావలి ప్రాంతంలో ఉన్న సమస్యలను తెలియచేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఆయన ప్రణాళికను రూపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న పాల్గొన్నారు.



పొదలకూరు పెద్ద మసీదు వద్ద పేరుకుపోయిన చెత్తలో సంచరిస్తున్న పందులు, పశువులు

రంజాన్ మాసంలో వసతులపై నిర్లక్ష్యం

● ముస్లింల ఆవేదన

పొదలకూరు, మార్చి 11 : పవిత్ర రంజాన్ మాసంలో వసతుల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి సారించలేదని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ మాసం ప్రారంభానికి కనీసం వారం రోజుల ముందు మండల స్థాయిల్లో అధికారులు సమావేశాలు ఏర్పాటుచేసి ముస్లింలు నివాసముండే ప్రాంతాల్లో, మసీదుల వద్ద పారిశుధ్యం మెరుగుపర్చడం, నీటికి ఇబ్బందుల్లేకుండా చూడడం, వీధి దీపాల మరమ్మతులు వంటి చర్యలు చేపట్టాలి. అయితే ఈఏడాది అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టి సారించలేదని పట్టణంలోని టైలర్స్ కాలనీ, ఆగచాట్లపురం, విఘ్నేశ్వరకాలనీ, శ్రీహరి కాలనీ, వినాయక మాన్యంలో ముస్లింలు వాపోతున్నారు. మస్జిద్‌ల వద్ద కూడా పారిశుధ్యాన్ని మెరుగుపరచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శిథిలావస్థలో సోమశిల నీటి పథకం

పట్టించుకోని అధికార యంత్రాంగం

అనంతసాగరం, మార్చి 11: ప్రజల దాహార్తి తీర్చేందుకు సోమశిలలో నిర్మించిన తాగునీటి పథకం మరమ్మతుకు గురై నిర్వాహణ లోపంతో శిథిలావస్థకు చేరుకుంది. స్థానిక అతిథిగృహం వద్ద పెన్నానదిలో సంప్ నిర్మించి అక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా అనంతసాగరం మండలంలోని 13 గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా సుమారు రూ. 7కోట్ల అంచనాతో 2011లో విని యోగంలోకి వచ్చిన ఈ పథకం నిర్దేశిత గ్రామా ల్లో తాగునీటి ఎద్దడిని తీర్చింది. అయితే 2021లో సోమశిలకు వచ్చిన భారీ వరదలకు పెన్నానదిలో ఏర్పాటుచేసిన మోటార్లు కొట్టుకుపోవడంతో నీటిపథకం మూలనపడింది. ఆతర్వాత రూ. 39 లక్షలతో పనులు చేసి వినియోగంలోకి తేవాలని అధికారులు ప్రణాళిక చేశారు. అయితే ఆ దిశగా పనులు పూర్తిచేయలేదు. అధికార యంత్రాగం పట్టించుకోక పోవడంతో విలువైన సామగ్రి, మోటార్లు తుప్పుపడుతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు

సోమశిల నీటి పథకం ద్వారా కమ్మవారిపల్లి, పీకేపాడు, ఉప్పలపాడు, వరికుంటపాడు, ముసాపురం, పాతాళపల్లి, గోవిందమ్మపల్లి, అనంత సాగరం, సోమశిల గ్రామాలకు నీటి సరఫరా జరిగేది. మూడేళ్లుగా సీపీడబ్ల్యూఎస్ స్కీం విని యోగంలో లేని కారణంగా ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి బోర్లు, ప్రత్యేక పైప్‌లైన్లు వేసి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే అవి



శిథిలావస్థకు చేరిన నీటిపథకం

మరమ్మతులకు గురైతే నీటి ఇబ్బందులు తప్ప వని, ఇకనైనా సోమశిల నీటి పథకాన్ని విని యోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా భీమేశ్వరుడి గ్రామోత్సవం



ఏకాంతసేవలో భీమేశ్వరస్వామి

సంగం, మార్చి 11: మండలంలోని వంగల్లులో జరుగు తున్న భీమేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అర్థరాత్రి స్వామివారికి ఏకాంతసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి, భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిం చారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిశాయి.

పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

ఉదయగిరి రూరల్, మార్చి 11: త్వరలో జరగనున్న ఎస్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈవో-1 మస్తాన్‌వలి సూచించారు. సోమవారం స్థానిక యాదవపాళెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల పఠన, బోధన సామర్థ్యాలను పరిశీలిం చారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఉదయగిరి, మార్చి 11: పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వినీత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నూర్జహాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 11: డీసీపల్లి పొగాకు బోర్డులో సోమవారం కనిష్ఠ, గరిష్ఠ ధరలు కేజీ రూ 230 పలికాయి. రైతులు బోర్డుకు 294 బేళ్లను తీసుకొని రాగా, 12 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 288 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 6 బేళ్లను తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

అనంతసాగరం, మార్చి 11: విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించవద్దని అనంతసాగరం ఎంపీడీవో తాజ్‌మాస్తూర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

పరమానందస్వామికి ప్రత్యేక పూజలు

కలువాయి, మార్చి 11: కలువాయి మండలం రాజుపాళెం సమీపంలోని ఆశ్రమ వ్యవస్థాపకుడు పరమా నందస్వామి 27వ ఆరాధన కార్యక్రమం సోమవారం జరిగింది. ఆశ్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ ప్రధాన అర్చకులు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరు, మార్చి 11 : ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలను 9959225645 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

బిట్రగుంట ఎస్ఐకు ఉద్యోగోన్నతి

నెల్లూరు (విద్య), మార్చి 11 : బిట్రగుంట ఎస్ఐ కే శేఖర్‌బాబుకు సీఐగా ఉద్యోగోన్నతి లభించింది. శేఖర్‌బాబు 2009లో పోలీస్‌శాఖలో ఎస్ఐగా విధుల్లో చేరి జిల్లాలోని వివిధ స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం బిట్రగుంటలో పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి లభించడంతో విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సేవాసమితి కమిటీ సభ్యులు

ఆత్మకూరు, మార్చి 11: మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం, నరసాపురం, శాంతినగర్, వెంకట్రావు పల్లిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచలనరసయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణ య్య, గాయత్రి, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

సీతారామపురం, మార్చి 11: మండల పరిధిలోని చిన్నగంపల్లి, పబ్బులేటిపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి ఉదయగిరి నియోజకవర్గ సమన్వకర్త మేకపాటి రాజ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన విజయ సంకల్ప యాత్ర జరు గుతుందని వైసిపి మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆత్మకూరు వైసీపీ నుంచి వలసల ప్రారంభం

● ఆనం సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక



ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

సంగం, మార్చి 11: మండలంలోని పలువురు వైసీపీ నాయకులు ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి టీడీపీలో చేరారు. మేకపాటి కుటుంబానికి సమీప బంధువు, మేకపాటి గౌతమ్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న మెట్టుకూరు వాసుదేవరెడ్డి, వాసుపల్లి శ్రీధర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, పెరమన గ్రామానికి చెందిన పిట్టు పట్టాభి రెడ్డి, ఆ గ్రామ ఉపసర్పంచ్ మాధవరెడ్డితో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వారివెంట వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

టీడీపీని గెలిపిస్తేనే భావితరాలకు భవిష్యత్తు



ప్రచారం చేస్తున్న టీడీపీ, యువత నాయకులు

ఆత్మకూరు, మార్చి 11 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తేనే భావితరాల భవిష్యత్ బాగుంటుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత నాయకుడు పి సాగర్ తెలిపారు. సోమవారం పట్టణంలో తెలుగు యువత ఆధ్వర్యంలో చంద్రబాబును గెలిపిద్దాం.. భావితరాల భవష్యత్‌కు బాటలు వేద్దాం అంటూ ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు మీ ఇంటి ముందుకు వచ్చి ఓటు అడిగితే ఏం అభివృద్ధి సాధించారో తెలపాలని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు తాటిపర్తి పెంచలయ్య, దండు ప్రవీణ్, గంటా నాగేంద్ర, మద్దినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేనికి పదవి పట్ల హర్షం

ఉదయగిరి రూరల్, మార్చి 11: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

జనసేన జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న బోగినేని కాశీరావు

సీతారామపురం, మార్చి 11 : మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నాయకులు బోగినేని కాశీరావు ఆధ్వర్యంలో సోమవారం జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గునుకుల కిషోర్, ప్రకాశం జిల్లా సమన్వయకర్త రంతుల్లా, మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు,సురేంద్ర, అల్లూరి రవీంద్ర, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ కాలనీలపై సమీక్ష

సీతారామపురం, మార్చి 11 : మండలంలో జరుగుతున్న హౌసింగ్ కాలనీల నిర్మాణాల పురోగతిపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్, హౌసింగ్ డిఇ ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్ మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్ చెన్న రాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సుమతి, బాలినేని ప్రవీన్, చిన్నయ్య, అంకయ్య, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

ఉదయగిరి, మార్చి 11: పొదుపు మహిళల అభివృద్ధే ప్రధానమంత్రి మోదీ లక్ష్యమని ఏపీఎం ఖాజారంతుల్లా అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానమంత్రి లక్‌పతి దీవెన పథకం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా పొదుపు మహిళలు కుటుంబ ఖర్చులు పోను రూ.10 వేలు ఆదాయం మిగిలే విధంగా ప్రణాళికలు తయారుచేసి రాబోవు రెండేళ్లల్లో లక్షాధికారులుగా చేయడమే లక్ష్యమన్నారు. మండలంలో ప్రతి పంచాయతీలో 70 మంది మహిళలను మొదటి విడతగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రత్నకుమారి, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, చిట్టిబాబు, పొదుపు మహిళలు, వీవోఏలు పాల్గొన్నారు.

స.హ చట్టం నోటీసుల జారీ

వరికుంటపాడు, మార్చి 11: సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న తనకు సకాలంలో సమాచారం అందచేయక పోవడంతో జిల్లా కలెక్టరేట్‌కు రాష్ట్ర కార్యాలయం నుంచి నోటీసులు అందినట్లు వరికుంటపాడుకు చెందిన నల్లగొర్ల మాల్యాద్రి తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 204లోని 4 ఎకరాల విస్తీర్ణంకు సంబంధించి లీగల్ సర్వీసు ఆథారిటీకి పంపిన నివేదికలను అందజేయాలని కోరుతూ 2022 సెప్టెంబరు 5న కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ తనకు సమాచారం అందకపోవడంతో అదే ఏడాది అక్టోబరు 7న ప్రథమ అప్పీలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన తాను సమాచార హక్కు చట్టం కమిషన్‌ను ఆశ్రయించడం జరిగిందన్నారు. దీంతో ఈ నెల 18న నేరుగా గానీ లేదా ఆన్‌లైన్ ద్వారా గానీ విచారణకు హాజరు కావాలని సూచిస్తూ కలెక్టరేట్‌తో పాటు తనకు కూడా నోటీసులు అందజేయడం జరిగిందన్నారు.

న్యాయం కోసం గిరిజనుల ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజనులు

ఉదయగిరి, మార్చి 11: న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని తిరుమలాపురం ఎస్టీ కాలనీ వాసులు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 68, 69, 70లలో 3.05 ఎకరాల భూమి తమకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందన్నారు. కాగా, అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యానికి పాల్పడుతూ గుడిసెల వద్ద చదును చేసి రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అవసరమైన వారు తమ వద్ద స్థలం కొనుగోలు చేసుకోవాలని అంటూ ఇటీవల కొంతమంది ఒక్కో ప్లాట్‌కు రూ.35 నుంచి రూ.50 వేల వరకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నారని వివరించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

కార్మికులకు వారాంతపు సెలవులివ్వాలి

నెల్లూరు (వైద్యం), మార్చి 11 : జిల్లాలోని కొండాపురం మండలం చింతలదేవిలోని నేషనల్ కామధేను బ్రీడింగ్ కేంద్రంలో పని చేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి పెంచల నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కొండయ్య, నాగేశ్వరరావు, రవితేజ, గిరి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సుప్రీంకోర్టు తీర్పును ఎస్బీఐ అమలు చేయాలి

● సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



ఎస్బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

కావలిటౌన్, మార్చి 11: ఎలక్ట్రోరల్ బాండ్ల విషయం లో సుప్రీం కోర్టు తీర్పును ఎస్బీఐ అమలు చేయాలని సీపీఎం జిల్లా నేత పసుపులేటి పెంచలయ్య పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఎస్బీఐ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్లు ఇవ్వడం చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో బాండ్ల వివరాలు మార్చి 6వ తేదీ లోపు వెల్లడించాలని ఆదేశించినప్పటికీ ఎస్బీఐ మరింత సమయమడగడం విడ్డూరమన్నారు. కేంద్రంలోని బీజేపీని బలపరిచేందుకు ఎస్బీఐ గడువు కోరుతుందన్నారు. ఇప్పటికైనా సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బాండ్ల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు మల్లికార్జునరావు, ఎస్‌కె మస్తాన్, కృష్ణమోహన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై విద్యార్థులకు వైద్య పరీక్షలు

జలదంకి, మార్చి 11: మండలంలోని జమ్మలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై జలదంకి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సోమవారం వైద్య పరీక్షలు చేశారు. 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ ఎ.శ్రీనివాసులు పరీక్షలు పరీక్షలు నిర్వహించి అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక జడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్‌లలో 1 నుంచి 6వ తరగతి విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యసిబ్బంది సోమవారం అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి అయోడిన్ లోపంతో జరిగే అనర్థాలపై వివరించారు. అదే విధంగా పలువురు విద్యార్థుల నుంచి యూరిన్ శాంపిల్స్, వాళ్ళ ఇళ్ళల్లో వాడే సాల్ట్ శాంపిల్స్‌ను సేకరించి జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయనికి పంపించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ సక్కుబాయమ్మ, వైద్యసిబ్బంది ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

అల్లూరు, మార్చి 11 : అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు ప్రతి నెల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేస్తారు. అందులో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివ ప్రియతో కలసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, మొగళ్లపల్లి సురేష్, మోమిడి మాధవరావు, ఒట్టూరు శ్రీనివాసులు, పొత్తూరు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, మొగళ్లపల్లి అనిత పాల్గొన్నారు.

యువత తలచుకుంటే దేశం తలరాతే మారుతుంది

కావలిటౌన్, మార్చి 11: యువత తలచుకుంటే దేశ తలరాతే మారుతుందని కావలి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పీఎస్సార్ ట్రస్ట్ కార్యాలయంలో రూరల్ మండలం నడింపల్లి గ్రామానికి చెందిన 150మంది యువత పసుపులేటికి మద్దతు తెలపగా వారికి సుగుణమ్మ కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం గాయత్రినగర్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పసుపులేటి సోదరుడు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కనుమలలో అరుదైన వృక్షాలపై పరిశోధనకు టీఆర్ఆర్ అధ్యాపకుడు

కందుకూరు, మార్చి 11: తూర్పు కనుమలలోని నల్లమల, శేషాచలం అడవుల్లో ఉన్న అరుదైన వృక్షసంపద, ఆ వృక్షసంపద వలన మానవాళికి ఉపయోగాలపై పరిశోధన చేసేందుకు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టరు తిరుపతిస్వామికి ప్రభుత్వం, అటవీశాఖల నుంచి అనుమతి లభించింది. టీఆర్ఆర్ వృక్షశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న ఆయన కడప, వెంకటగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న వృక్షశాస్త్ర అధ్యాపకులతో కలిసి బృందసారథిగా ఈ పరిశోధనను ఏడాది పాటు నిర్వహించేందుకు అనుమతి లభించింది. ముఖ్యంగా తూర్పు కనుమలలో ఉన్న అరుదైన వృక్షసంపద యొక్క ఔషధ గుణాలను అధ్యయనం చేసి తద్వారా మానవాళికి చేకూరే ప్రయోజనాలపై నివేదిన సిద్ధం చేయడం ఈ పరిశోధన ఉద్దేశని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. ఇటీవలే ఆంధ్రకేసరి యూనివర్సిటీ వారు కళాశాల ఇతర మూడు విభాగాలతో పాటు వృక్షశాస్త్ర విభాగానికి కూడా పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసి తిరుపతిస్వామికి రీసెర్చ్ గైడ్‌షిప్‌ను మంజూరు చేశారని ఆయన తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కందుకూరు, మార్చి 11: వెలుగు సిబ్బంది, మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సిబ్బంది సోమవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కందుకూరు మండలంలో 1,799 మందికి, మున్సిపాలిటీ పరిధిలో 2,362 మంది మహిళలకు పొదుపు రుణమాఫీ నాలుగో విడత కింద ఆసరా చెక్కులను వారివారి ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు.

రామాయపట్నం పోర్టులో రక్తదానం

గుడ్లూరు, మార్చి 11 : మండలంలోని మొండివారిపాలెంలో నిర్మిస్తున్న రామాయపట్నంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రామాయపట్నం పోర్టు సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా కావలి రెడ్‌క్రాస్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రామాయపట్నం పోర్టు ప్రాజెక్టు హెడ్ కంద పెరుమాళ్, జనరల్ మేనేజర్ శేషు ప్రారంభించారు. అనంతరం రామాయపట్నం పోర్టులో పనిచేస్తున్న 57 మంది సిబ్బంది రక్తదానం చేశారు. పోర్టు సేఫ్టీ మేనేజర్ పోలారావు పాల్గొన్నారు.

భీమవరం హైస్కూల్ వార్షికోత్సవం

ఉలవపాడు, మార్చి 11 : మండలంలోని భీమవరం హైస్కూల్లో సోమవారం ప్రధానోపాధ్యాయుడు బండి సుబ్బారావు అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, ప్రసాద్, హనోక్, మస్తాన్ వలి, హేమలత, చిట్టిబాబు, సుబ్బారావు, లలిత పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్యా యత్నం

వలేటివారిపాలెం, మార్చి 11: కుటుంబ కలహాల నేపథ్యంలో యువకు డు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండ లంలోని కాకర్లవారిపాలెంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు.. కాకర్లవారిపాలెంకు చెందిన పెయ్యిల మాధవ అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్థులు చికిత్స నిమిత్తం మాధవరావును 108 వాహనంలో వలేటివా రిపాలెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మార్చి 11 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో యు శేషుబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

14న వలేటివారిపాలెం...

వలేటివారిపాలెం, మార్చి 11 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పొనుగోటి మౌనికి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కర్లపాలెం, సాలిపేట నిర్వాసితుల

సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



సబ్‌కలెక్టరు విద్యాధరితో మాట్లాడుతున్న నిర్వాసితులు

కందుకూరు, మార్చి 11: రామాయపట్నం పోర్టు నిర్వాసిత గ్రామాలైన కర్లపాలెంలో 14 మందికి, సాలిపేట ఎస్టీ కాలనీలో 84 మందికి వెంటనే ప్యాకేజీ నగదు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసిత కుటుంబాల సర్వే సమయంలో సాలిపేట ఎస్టీ కాలనీ నుంచి తాత్కాలిక వలసలు వెళ్లి ఉన్న 18 మందిని కూడా జాబితాలో చేర్చాలని, కర్లపాలెం, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం, సాలిపేట గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఆర్ఆర్ ప్యాకేజీ అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు విద్యాధరి మాట్లాడుతూ రెండురోజుల్లో ప్యాకేజీ డబ్బులు వారి ఖాతాలకు జమచేస్తామని, వచ్చిన నగదును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం సర్పంచు చాపల రమణయ్య, చాపల శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, చేవూరి స్వామి, బాపట్ల కాలేషా, మస్తాన్‌రావు, చాపల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

● ట్రంకురోడ్డు వెంబడి వ్యాపార వర్గాలను కలసిన కావ్య



ఎన్నికల ప్రచారంలో కావ్య, టీడీపీ నేతలు

కావలి, మార్చి 11: కావలి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆయా పార్టీల క్యాడర్‌తో కలిసి సోమవారం కావలి ట్రంకు రోడ్డు వెంబడి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వ్యాపారవర్గాలను కలసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీ వద్ద నుంచి రోడ్డుకు పశ్చిమ మార్గంలో ఉన్న వ్యాపారవర్గాలు, రోడ్డు మార్జిన్ వ్యాపారులతో ఆయన మమేకమై సైకిల్ గుర్తుపై టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని, చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని అభ్యర్థించారు. వ్యాపార వర్గాల సాధకబాధకాలను తెలుసుకుని టీడీపీ అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలకు సంబంధించిన మేనిఫెస్టోను, కావలిలో తనను గెలిపిస్తే నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన సొంత మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను వ్యాపారవర్గాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో విజయం సాధిద్దాం !

● జనసేన ప్రచార ర్యాలీని ప్రారంభించిన ఇంటూరి



ప్రచార రథాలకు జెండా ఊపుతున్న నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 11: తెలుగుదేశం, జనసేన పార్టీ అధినేతల ఆదేశాలతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పరస్పరం సహకరించుకుంటూ ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంకు చెందిన ఎన్ఆర్ఐ కొట్టే ఉదయ భాస్కర్ కొట్టే వారి లక్ష్యం కొణిదల వారి విజయం పేరుతో ఏర్పాటు చేసిన జనసేన ప్రచార రథాల విజయ యాత్ర సోమవారం కందుకూరుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఇరుపార్టీల నేతలు ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి టీడీపీ, జనసేన జెండాలను ఊపి విజయయాత్రను ప్రారంభించి యాత్రలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో బీజేపీ కార్యాలయానికి వెళ్లిన ఇంటూరి నాగేశ్వరరావు ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబుతో సమావేశమై బీజేపీ నాయకులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, గోచిపాతల మోషే, చిలకపాటి మధు, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, సవిడిబోయిన వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


శబ్ద కాలుష్యం నుంచి కాపాడండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కావలి, మార్చి 11: సార్వత్రిక ఎన్నికల ప్రచారం వేళ కావలి నియోజకవర్గ ప్రజలను శబ్ద కాలుష్యం నుంచి కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఈ మేరకు సోమవారం కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. కావలి పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలలో కూడా ఎన్నికలు రాకముందే వేకువ జాము నుంచి డీజే మైకులు పెట్టి పెద్ద పెద్ద శబ్దాలతో గుండె దడ పుట్టిస్తున్నారన్నారు. గుండె జబ్బులు ఉన్న వారు ఈ శబ్దాలకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీస్‌లు కూడా విచ్చలవిడిగా మైక్ పర్మిషన్‌లు ఇస్తున్నారన్నారు. పర్మిషన్లు అతిక్రమించి మైక్‌లు పెట్టి పెద్దపెద్ద శబ్దాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, ముక్కు మోహన్‌రావు, జడ్డా వాసు, షేక్ ఖాదర్‌బాష, షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఆఖరిసారి పోటీ చేస్తున్నా.. సహకరించండి : కాటంరెడ్డి



మాట్లాడుతున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు, మార్చి 11 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆఖరిసారి పోటీ చేస్తున్నానని తనకు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలో ఆయన గిరిజనులతో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గిరిజనులకు అనేక విధాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వయసు పెరుగుతున్న నేపథ్యంలో ఇదే ఆఖరి ఎన్నికలుగా నిర్ణయించుకొని చివరిసారిగా ఓటు అడిగేందుకు తాను ముందుకు వచ్చానన్నారు. స్వగ్రామ వాసినని, అందరికీ సుపరిచితుడునైన తనను ఆదరించి ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ, గుర్తు ఇప్పటి వరకు లేవని, అవి కేటాయించేలోపు ముందుగా కలిసేందుకు ఈ సమావేశం నిర్వహించానన్నారు. ప్రతి ఒక్కరూ చివరిసారిగా ఈ ఎన్నికల్లో పోటీలో ఉంటున్న తనకు ఓటు వేసి గెలిపించాలని, తద్వారా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, గోసా గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, ప్రభాకర్, మాతయ్య, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 11: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6 వతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల కొరకు ఏప్రిల్ 11 వరకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైభవంగా కళ్యాణ వేంకటేశ్వరుడి రథోత్సవం

● గోవింద నామ స్మరణతో మార్మోగిన బుచ్చి





బుచ్చి చెన్నూరురోడ్డులో జరుగుతున్న రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి, సమేత కళ్యాణ వేంకటేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 11: స్థానిక రామకృష్ణానగర్‌లో వెలసి ఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతుడైన కళ్యాణ వేంకటేశ్వరుడు సోమవారం రథోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి బయలుదేరిన రథోత్సవం శేఖర్‌రెడ్డి ఆసుపత్రి వద్ద చెన్నూరురోడ్డులోకి వచ్చి బస్టాండ్ సెం టర్‌కు చేరింది. అక్కడి నుంచి తిరిగి చెన్నూరు రోడ్డు మీదుగా మలిదేవి కాలువ వరకు వెళ్లి తిరిగి శేఖర్‌రెడ్డి అసుపత్రి ఎదురు వీధిలో నుంచి ఆలయానికి చేరింది. రథోత్సవం ఆద్యంతం భక్తుల గోవిందనామస్మరణతో బుచ్చి మార్మోగింది. కోలాటాలు, భజనలు, వేషధారణలు భక్తులను అలరించాయి. రథం లాగే భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలు, పులిహోర, దద్దోజనం వంటి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ పాలక మండలి అధ్వర్యంలో జరిగిన రథోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లు తొలగించి సరఫరా నిలిపివేశారు. రథోత్సవం అనంతరం విద్యుత్‌లైన్లు పునరుద్ధరించారు. ఈ కార్యక్రమానికి కేతరాజు కేశవరావు, కొండముద వెంకటరమణయ్య, కాసుల వెంకటరమణయ్య, ఈమని శ్రీనివాసరావు, పాముూరు రమణయ్య, కొంజేటి వెంకటశేషయ్య, యారాశి మహేష్, పరిటాల అనీల్‌కుమార్ కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ఉదయం మహా పూర్ణాహుతి, మహా కుంభ ప్రోక్షణ అనంతరం చక్రస్నానం, సాయంత్రం స్వామి వారికి పుష్పయాగం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం

● మంత్రి కాకాణి

పొదలకూరు, మార్చి 11: పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో సిమెంటు రోడ్లు, సైడ్ కాలువలను మంత్రి ప్రారంభించారు. మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో శ్రీకృష్ణమందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాక్షస పాలన అంతమొందించేందుకే పొత్తులు

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

ముత్తుకూరు, మార్చి 11 : వైసీపీ రాక్షసపాలన అంత మొందించాలనే లక్ష్యంతో టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయని జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. పిడతాపోలూరులో సోమవారం జరిగిన బాబుషూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, రాధాకృష్ణమనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ఈపూరు మునిరెడ్డి, నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాలపై సర్వే

ఇందుకూరుపేట, మార్చి 11 : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు అయోడిన్ లోపాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు సోమవారం సర్వే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పల్లెపాడు గవర్నమెంటు హైస్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సిబ్బంది యూరిన్ శాంపిల్స్, సాల్ట్ శాంపిల్స్ సేకరించి డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం జ్ఞానప్రసూన, ఉపాధ్యాయుడు సుభాష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్ బాబు, సీహెచ్‌వో కమల, ఏఎన్‌ఎం దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తోటపల్లిగూడూరు, మార్చి 11 : మండలంలోని వరిగొండ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని నెల్లూరు సేవా భారతి, వరిగొండ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరిగొండ సర్పంచ్ ఈగ సుబ్బరత్నమ్మ, జిల్లా సహ సేవా ప్రముఖ్ ఎం వెంకటేశ్వర్లు, ఖండ సేవా ప్రముఖ్ ఎం ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

విడవలూరు, మార్చి 11: మండల పరిధిలోని వావిళ్లలో మాజీ ఎంపీపీ తూళ్లూరు గోపాల్ తల్లి తూళ్లూరు లక్ష్మమ్మ(87) సోమవారం మృతి చెందారు. మృతురాలి నేత్రాలను మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను నెల్లూరుకి చెందిన మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యుడు వేణు సేకరించారు.

పౌష్టికాహారంపై అవగాహన

సైదాపురం, మార్చి 11: మండల కేంద్రం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీ సునంద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందజేసే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ముస్లిం కుటుంబాలకు చేయూత

పొదలకూరు, మార్చి 11: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసాలు చేసే పేద ముస్లిం కుటుంబాలకు చేయూతనందిస్తామని పట్టణానికి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నౌరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అవసరం అయిన వారికి సహరీని ఇంటివద్ద పంచుతామని, ఇంటివద్దకు రాలేని వారికి ఇంటి వద్దకు వచ్చి అందిస్తామన్నారు. ప్రయాణంలో ఉన్న వారెవరైనా ఫోన్ చేస్తే వారికి కూడా అందిస్తామన్నారు. సహరీ కావాల్సిన వారు 94945 80902, 90307 22481 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ప్రకటించాలి

కోవూరు, మార్చి 11: ఎలక్టోరల్ బాండ్ల వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ సోమవారం స్థానిక రైల్వే ఫీడర్సు రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ దేశంలోని ఎస్‌బీఐ బ్యాంకుల నుంచి ఎంత మొత్తంలో ఎలక్టోరల్ బాండ్లను సేకరించింది ప్రకటించాలన్నారు. అనంతరం సీపీఎం నాయకులు బుజ్జయ్య, చాంద్‌బాషా, అఫ్రోజ్, రమేష్, కాలేషా, తిరుపతి, హుమాయిన్‌లు మేనేజరుకు వినతిపత్రం సమర్పించారు.

నెల్లూరు (వైద్యం) : ఎలక్టోరల్ ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే వెల్లడించాలని నెల్లూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం వేదాయపాళెం ఎస్‌బీఐ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా ఎలక్టోరల్ బ్యాండ్లను ప్రవేశపెట్టిందని, అవినీతి సొమ్మును బ్యాంకుల్లో దాచిపెట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడి వివరాలను ఎస్‌బీఐ వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తల కిష్టయ్య, కొండాప్రసాద్, మాలకొండయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీచ్ రోడ్లు అధ్వానం

● జనసేన నాయకుల నిరసన



బీచ్‌రోడ్‌పై నిరసన చేస్తున్న జనసేన నాయకులు

తోటపల్లి గూడూరు, మార్చి 11 : వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి పర్యాటక రంగం బీచ్ రోడ్లను గాలికి వదిలేసిందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్‌నాయుడు విమర్శించారు. సోమవారం మండలంలోని కోడూరు బీచ్ రోడ్‌పై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బొబ్బేపల్లి మాట్లాడుతూ జనసేన - టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీచ్ రోడ్లకు కొత్త హంగులు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మహిళా అధ్యక్షురాలు గుమ్మనేని వాణి భవానీ, శ్రీహరి, జయసుధ, రహీం అక్బర్, గణేష్, విజయ్, శ్రావణ్, కల్యాణ్, మనోజ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం

కోవూరు, మార్చి 11: అనంతసాగరం మండల పరిధిలోని లింగంగుంటకు చెందిన దాసరి వెంకటయ్య ఇటీవల కల్లుగీస్తూ తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రం గా గాయపడ్డారు. శస్త్ర చికిత్స అనంతరం ఆయన స్థానిక గమళ్లపాళెంలోని ఆయన కుమార్తె ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం జిల్లా గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్ సూచనల మేరకు అధ్యక్షుడు తోట ప్రభాకర్ రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట గౌడ సంఘం నాయకులు ఉప్పాల రామకృష్ణయ్య, తాళ్ల రాజాగౌడ్, చిన్న గోవిందగౌడ్, కోసూరు వంశీకృష్ణగౌడ్, మారుబోయిన సుబ్బారాయుడుగౌడ్, కోనేటి మునిరత్నం గౌడ్ ఉన్నారు.

కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగించాలి : సీఐటీయూ

నెల్లూరు (వైద్యం): కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగించాలని, ఇందుకోసం ఆందోళన చేస్తున్న నేతలతో యాజమాన్యం దురుసుగా ప్రవర్తించటం దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ నిరసన తెలిపారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోపాటు వామపక్ష నేతలపై ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కలెక్టర్ హరినారాయణన్ స్పందించి కంటైనర్ టెర్మినల్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

పాలిసెట్‌పై అవగాహన

తోటపల్లిగూడూరు, మార్చి 11 : మండలంలోని చెన్నపల్లిపాలెం ఐవీఆర్‌ఎం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాలిసెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంకేతిక విద్య రీజనల్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పాస్ అయిన తర్వాత పాలిటెక్నిక్‌పై దృష్టి పెట్టాలని కోరారు. పాలిటెక్నిక్ కోర్సులు ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చాంబర్ రాష్ట్ర కార్యదర్శిగా గోపిరెడ్డి

తోటపల్లిగూడూరు, మార్చి 11 : మండలంలోని విలుకానిపల్లి గ్రామానికి చెందిన గోపిరెడ్డి వెంకటేష్‌ను ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. తిరుపతిలో జరిగిన సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు వైవిబి రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం గోపిరెడ్డి మాట్లాడుతూ బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు.

బుచ్చి అర్బన్ పీహెచ్‌సీ తరలింపు ?

● వవ్వేరుకు మార్చాలని వైసీపీ నేత యత్నం ● ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒత్తిడి



కట్టుబడిపాళెంలో నిర్మిస్తున్న అర్బన్ పీహెచ్‌సీ భవనం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి11: బుచ్చిలో 2021 నుంచి ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని, అందులో డాక్టర్ వైఎస్‌ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) నిర్వహిస్తున్నారు. ఈ ఆసుపత్రిని వవ్వేరుకి తరలించేందుకు అధికార పార్టీ నేత చేస్తున్న యత్నాలకు స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. ఆసుపత్రి మార్పుకోసం ఆ నేత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి నిత్యం ఫోన్లు చేయిస్తూ, అధికారులపై తీవ్ర ఒత్తిడి చేయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం డీఎంహెచ్‌వో పిలుపుతో ఆసుపత్రి వైద్యాధికారి, స్టాఫ్ నర్సులు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లారు. కాగా బుచ్చి నగర పంచాయతీ పరిధి కట్టుబడిపాళెంలో నాలుగు జగనన్న లేఔట్ల ఏర్పాటుతో అక్కడ అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటైతే బుచ్చితోపాటు కట్టుబడిపాళెం, రామచంద్రాపురం, ఇందిరప్రభ కాలనీ, శ్రీపురంధరపురం, రెడ్డిపాళెం, మునులపూడి, నాగాయగుంట ప్రజలకు వైద్యసేవలు చేరువవుతాయి.ఈ ఉద్దేశ్యంతో కట్టుబడిపాళెం జగనన్న లేఅవుట్-1లో యూపీహెచ్‌సీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయ్యాయి. మరో రెండునెలల్లో ఆసుపత్రి ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో ఓ వైసీపీ నాయకుడు వవ్వేరుకు మార్చే ప్రయత్నాలపై పలువురు తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.

మార్పు తగదు...



మారుమూల ఉన్న వవ్వేరు గ్రామానికి బుచ్చి అర్బన్ పీహెచ్‌సీని మార్పుచేయాలను కోవడం వైసీపీ నేత కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి చేస్తున్న ఓట్ల రాజకీయమే. ఈ తరలింపు ప్రయత్నాలను మానుకోవాలి. ఈ విషయమై వారం క్రితం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం.

- కాసా శ్రీనివాసులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, బుచ్చి

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

టీడీపీలో యువతకు ప్రాధాన్యం

మాజీ మంత్రి పొంగూరు నారాయణ



టీడీపీలో చేరిన యువతతో నారాయణ తదితరులు

నెల్లూరు (వైద్యం), మార్చి 11 : తెలుగుదేశం పార్టీలో యువతకు తగిన ప్రాధాన్యత ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ వెల్లడించారు. సోమవారం నారాయణ క్యాంపు కార్యాలయంలో నాయకుడు అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో 39వ డివిజన్‌కు చెందిన పలువురు యువత పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా, నగరంలోని 40, 42 డివిజన్లలో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పర్యటించారు. ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరారు.

రాష్ట్ర ప్రగతి కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలయిక

రాష్ట్ర ప్రగతి కోసమే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు వెల్లడించారు. సోమవారం నగరంలోని అగ్నిపేట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభలో అంతా గ్రాఫిక్స్ : కోటంరెడ్డి

నెల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సిద్ధం సభలకు జనాలు రావడమనేది అంతా గ్రాఫిక్స్ అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. సోమవారం నగరంలోని 6, 54 డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నారాయణ తరపున అక్కడి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ రానున్న ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని అభ్యర్థించారు. సిద్ధం సభలకు జనాలు రాకపోవడంతో గ్రీన్ మ్యాట్లు వేసి మాయ చేస్తున్నారని విమర్శించారు. జగన్ జిమ్మిక్కులు తెలిసే బీజేపీ దూరం పెట్టిందన్నారు. నెల్లూరు సిటీలో నారాయణ తిరుగు లేని మెజారిటీతో విజయం సాధించబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ జహీర్, కొండా ప్రవీణ్, అన్నపూర్ణ, షహీద్, సాజీద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి ముగ్గురు వైసీపీ నేతలు? : శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 11 : ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీకి చెందిన ముగ్గురు కీలక నేతలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సమక్షంలో భారీగా టీడీపీలో చేరికలు జరిగాయి.

● 37వ డివిజన్ క్రాంతినగర్‌కు చెందిన బిరదాల చంటి, దర్శిగుంట వెంకటేష్, బుజ్జలపూడి అభిషేక్, వారి మిత్రబృందం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ సమక్షంలో పార్టీలో చేరారు.

● రూరల్ మండలం కొత్త వెల్లంటి గ్రామానికి చెందిన మారం శ్రీనివాసులురెడ్డి, కైపు రాఘవరెడ్డి దాదాపు 500 మందితో పార్టీలో చేరారు. మండల కన్వీనర్ పమజుల ప్రదీప్, నాయకులు బెలూం శ్రీనివాసులురెడ్డి, జనపాల వెంకటరమణారెడ్డి, కైపు ఆదిత్యరెడ్డి, ఆమవరపు వెంకటేశ్వర్లు, కొప్పాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

● రాజరాజేశ్వరి ఆలయం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు బాలరథ్ కృష్ణప్రసాద్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో శ్రీధర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

● 23వ డివిజన్ చలపతి నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు ఉండేళ్ల కృష్ణారెడ్డి, కొడవాటి వెంకట రామాంజనేయులు, సీపీఎం నాయకుడు వీర్ల రామచంద్రయ్య కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

నారాయణతోనే నగరాభివృద్ధి

నెల్లూరు (విద్య), మార్చి 11 : నెల్లూరు నగరాభివృద్ధి పొంగూరు నారాయణతోనే సాధ్యమవుతుందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణుకుల కిషోర్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందచేసి మాట్లాడారు. హేమచంద్ర యాదవ్, ప్రశాంత్‌గౌడ్, శ్రీను, కేశవ, మౌనిష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి విజయానికి కృషి

నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని బీజేపీ నేతలు తెలిపారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయానికి వేమిరెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి స్వాగతించి శాలువాతో సత్కరించారు. పార్టీ నేతలంతా కలిసి వేమిరెడ్డి గెలుపు కోసం శ్రమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జి పీ సురేంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్, ఆంజనేయరెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'రత్నం'కు బంగారు పతకం

నెల్లూరు (విద్య): అంతర్జాతీయ సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో రత్నం స్కూలు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యా సంస్థల్లో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో జీఎం రామ్మూర్తి నాయుడు మాట్లా డుతూ తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఏ దీనసాయిశ్రీ మెడల్ ఆఫ్ డిస్టింక్షన్ సాధించి రెండో లెవల్‌కు ఎంపికైందని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఏ మనోజ్ఞ, కే సుహాన, వై చరణ్‌తేజ, జీ పూజిత కృష్ణవేణి, ఎం చక్రీ గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సలెన్సీ సాధించారన్నారు. జాతీయ సైన్స్ ఒలంపియాడ్‌లో ఎస్ షైనీ, సోషల్ సైన్స్ ఒలంపియాడ్‌లో ఏ ధన్వతి గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్సెలెన్సీ సాధించారన్నారు. విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ ప్రపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అయోడిన్ లోపాన్ని నివారించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), మార్చి 11 : విద్యార్థుల్లో అయోడిన్ లోపాల్ని నివారించాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తెలియచేశారు. సోమవారం వెంగళరావునగర్‌లోని నగరపాలక పాఠశాలలో అయోడిన్ లోపంపై పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు అనుమానిత విద్యార్థుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షల కోసం విజయవాడకు పంపించామన్నారు. 5 నుంచి 13 ఏళ్లలోపు పిల్లలకు తగినంత అయోడిన్ లేకపోతే ఎదుగుదల ఆగిపోతుందని చెప్పారు. ఈ క్రమంలో 30 పీహెచ్‌సీల పరిధిలో అయోడిన్‌పై ప్రత్యేక సర్వే చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌హెల్త్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ దివ్య, రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు గాజు క్లాత్ కటింగ్ మిషన్ వితరణ

నెల్లూరు (వైద్యం), మార్చి 11 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి గాజు క్లాత్ కటింగ్ యంత్రాన్ని ఆ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ కాకుటూరి లక్ష్మీసునంద తన సొంత నిధులతో వితరణ చేశారు. ముంబై నుంచి తెప్పించిన ఆ పరికరాన్ని సోమవారం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ సిద్దా నాయక్‌కు అప్పగించారు. ఏడీ డాక్టర్ కళారాణి, డాక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 11 : అగ్నిపథ్ పథకంలో భాగంగా ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సెంట్రల్ సీఈవో వెంకటయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి జిల్లాలకు చెందిన అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను పరిశీలించి అర్హత కలిగిన వారు ఈనెల 22వతేదీలోపల రిజిస్టర్ చేసుకోవాల న్నారు. ఏప్రిల్ 22న రాత పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

ఇస్కాన్ సిటీలో చోరీ

నెల్లూరు (విద్య), మార్చి 11 : నగరంలోని ఇస్కాన్‌సిటీలో గల రాజతిమ్మారెడ్డి నివాసంలో చోరీ జరిగింది. ఆయన కుటుంబంతో కలిసి ఈనెల 8వతేదీన అరుణాచలం వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. రూ.12లక్షల నగదు, 46 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. 9వతేదీన బాధితులు ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉద్యోగాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్, చీటీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపారు. సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర పోలీసు సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని మోసాలకు పాల్పడేవారి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చీటీల పేరుతో పెద్ద ఎత్తున నగదు వసూలు చేసి కుటుంబంతో సహా పరారవుతున్న వారి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్తికోసం తల్లిదండ్రులను హింసించే పిల్లలపై, మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 'స్పందన'లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, టీ సాయినాథ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 11 : రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు అర్హులైన జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇంటి స్థలాల కేటాయింపు త్వరితగతిన పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్), ఏపీబీజేఏ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. నాయకులు మాట్లాడుతూ భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ధర నిర్ణయించి స్థలాలు కేటాయించాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఇళ్ల స్థలాల కేటాయింపుపై అధికారు లందరినీ సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, జర్నలిస్టులపై దాడుల నిరోధానికి హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ నాయకులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ బాలకృష్ణ, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడు మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు స్వచ్ఛందంగా ప్రజలు : కాకాణి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 11 : మేదరమెట్లలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ కేవలం మగవారు మాత్రమే ఈ సభకు వస్తారనుకొంటే మహిళలు లక్షలాదిగా తరలిరావటం ఆనందదాయకమన్నారు.

గవర్నర్ రాక కోసం ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(హరనాథపురం), మార్చి 10 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ, ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ లబ్ధిదారులతో వర్చువల్‌గా సంభాషించే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నెల్లూరు వస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాట్లను కలెక్టర్ హరినారాయణన్ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ ఈడీ కామంచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 11 : జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 11 మోడల్ స్కూల్స్‌లో చేరేందుకు ఏప్రిల్ 21వతేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం www.cse.ap.gov.in, www.apms.ap. gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31వతేదీ లోపల ఆన్ లైన్‌లో రుసుము చెల్లించాలని, వివరాలకు సమీపంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

నెల్లూరు (విద్య), మార్చి 11 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అందచేశారు. నగరంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తనవద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇప్పటికే వైఎస్‌ఆర్ బీమా కింద రూ.5లక్షలు అందచేశామని, తాజాగా సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10లక్షలు విడుదల కావడంతో మృతుని సతీమణి లక్ష్మికి చెక్కును అందచేశామని చెప్పారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

నెల్లూరు (విద్య), మార్చి 11 : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరుకావాలని లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ పీ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని డీపీఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అతిథిగా హాజరైన డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగసాయి సూరి, జయప్రకాష్, వేణుగోపాల్, రూడ్స్ సంస్థ చైర్మన్ షేక్ రసూల్, దూడల ప్రసాద్‌రావు, వెంకట నరసయ్య, హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సెక్షన్ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు (జడ్పీ), మార్చి 11: నగరంలోని వెంకటేశ్వరపురంలో విద్యుత్ సెక్షన్ నూతన కార్యాలయాన్ని ఎస్‌ఈ విజయన్ సోమవారం ప్రారంభించారు. ప్రతి ప్రాంతానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నగరంలో ఇప్పటికే 11 సెక్షన్ల కార్యాలయాలను ఏర్పాటు చేశామని, వెంకటేశ్వరపురంలో 12వ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, డిప్యూటీ ఈఈలు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్, ఏఈ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

శాయాజీరావు గైక్వాడ్‌కు నివాళి

నెల్లూరు(హరనాథపురం) : బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్ విద్యా దాత అని జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవి కొనియాడారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం గైక్వాడ్ 162వ జయంతిని అంబేడ్కర్ మిషన్ చైర్‌పర్సన్ కే తిరువల్లూరు అధ్య తన నిర్వహించారు. అంబేడ్కర్‌ను గైక్వాడ్ చదివించారని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మిషన్ వర్కింగ్ చైర్మ న్ వై రామకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి టీ పవన్‌కుమార్, కోశాధికారి ఎం పెంచలయ్య, సంయుక్త కార్యదర్శులు వై చెన్నయ్య, పీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయండి

నెల్లూరు(సిటీ) : రంజాన్ నెల మొదలవుతున్న నేపథ్యంలో మసీదుల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులు ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సమీక్షలో వారు మాట్లాడారు. నగరంలోని మసీదుల వద్ద పారిశుధ్య పనులు మెరుగుపరచాలన్నారు. ఉపవాస దీక్షలు నిర్వహించుకునేందుకు కనీస సౌకర్యాలన్నీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కే రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉంచొద్దు

నెల్లూరు(సిటీ) : నగర ప్రజలు స్పందన కార్యక్రమంలో తెలియజేసిన సమస్యలను పెండింగ్‌లో ఉంచొద్దని ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించి 30 మంది తమ సమస్యలను తెలియచేశారని వాటన్నింటికి పరిష్కారం చూపాలన్నారు. రంజాన్ మాసం దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని కొందరు ముస్లిం పెద్దలు విన్నవించారు.

కళ్యాణం కమనీయం



పెండ్లిమండపం వద్ద వధూవరుల అలంకరణలో ఆది దంపతులు



అశేషభక్త జనం మధ్య కల్యాణోత్సవ పూజలు

- ఆది దంపతుల వివాహ వేడుకలతో శోభిల్లిన శ్రీకాళహస్తి క్షేత్రం
- అదే ముహూర్తాన ఒక్కటైన 30 జంటలు



వధూవరులకు వస్త్రాలందజేస్తున్న ముక్కంటి ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మార్చి 11: గజవాహనంపై వరుడిగా శివయ్య ... సింహవాహనంపై సిగ్గులొలుకుతూ పార్వతమ్మ కల్యాణోత్సవ వైభవంతో శ్రీకాళహస్తి క్షేత్రం పరవశించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్కందరాత్రిని పురస్కరించుకుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు... మేళ తాళాలు... కళాకారుల ఆటపాటల మధ్య ఆదివారం అర్ధరాత్రి వివాహ వేదిక వద్దకు కోలాహలంగా తీసుకువచ్చారు. చతుర్వేద పారాయణం పూర్తయ్యాక సప్తపది కార్యక్రమం ఆగమోక్తంగా ప్రారంభమైంది. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్ గురుకుల్ సారథ్యంలో సప్తపది విశేషోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. స్కందుడి జననం కోసం నిర్వహించిన కళ్యాణోత్సవ ఘట్టంలో చండికేశ్వర రాయబార పర్వం రక్తికట్టించింది. హిమవంతుడి కుమార్తె అయిన పార్వతీదేవికి, పరమేశ్వరుడికి పరిణయం నిశ్చయం చేసేందుకు బ్రహ్మ, విష్ణువులతో పాటు ఇంద్రాది సకల దేవతలు తరలివచ్చారు. జగద్రక్షకుడైన స్వామి వారు చిటికెడు విభూది, ఒక్క బిల్వపత్రం కట్నంగా ఇచ్చేలా రాయబారం కొనసాగింది. ఉదయం 5 గంటల సమయంలో మాంగల్యధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఇదే ముహూర్తంలో 30 జంటలు పెండ్లి మండపం వద్ద వివాహంతో ఒక్కటయ్యాయి. అంతకు ముందు వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు,పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వీక్షించేందుకు వచ్చిన భక్త జనంతో నగిరి వీధి, నెహ్రూ వీధి నిండిపోయాయి. అనంతరం ఆది దంపతులు నారద పుష్కరిణి, విజ్ఞానగిరి, ఆ తరువాత పురవీధుల్లో ఊరేగి భక్తులకు నవ దంపతులుగా దర్శమిచ్చారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పూర్వ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం... నటరాజ కల్యాణోత్సవం

సకల శాస్త్రాలకు ఆదిగురువైన నటరాజు, శివకామ సుందరి పరిణయోత్సవం సోమవారం రాత్రి ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శివకామ సుందరి సమేత నటరాజస్వామికి జరిపిన



మాంగల్యం చూపుతున్న ప్రధాన అర్చకుడు

ఈ కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాది కార్యక్రమాలు జరిపారు. చివరిగా యాగకలశంలోని పవిత్రజలంతో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాలమధ్య ప్రధాన అర్చకులు మాంగల్యధారణ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.సోమవారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు.

అన్ని పార్టీల్లో అస్పష్టతే!

అభ్యర్థులెవరో తెలియక అయోమయంలో శ్రేణులు

ఆరు పూర్తిగా, మరో రెండు పాక్షికంగా... వెరసి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. పొత్తులో భాగంగా టీడీపీ ఏడింటిని ఎంచుకోగా నాలుగు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక ఖరారు కాలేదు. జనసేనకు కేటాయించిన ఏకైక సీటులోనూ అభ్యర్థి ఎవరన్నది తేలడం లేదు. ఈ రెండు పార్టీలతో పొత్తు బంధంలోకి వచ్చిన బీజేపీ ఏ స్థానం కోరుతుందో తెలియడం లేదు. అధికారంలో వున్నందున అభ్యర్థుల ఎంపికలో అందరికంటే ముందంజలో వుంటుందని భావించిన వైసీపీలో సైతం మూడు సీట్లపై అయోమయం తప్పడం లేదు. ఇక కొత్తగా ఉత్సాహం పుంజుకున్న కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అసలు మొదలే కాలేదు. ఎన్నికల షెడ్యూలు నాలుగైదు రోజుల్లో వెలువడనున్న తరుణంలో ప్రధాన రాజకీయ పార్టీల తీరిలా వుండడంతో శ్రేణుల్లో తీవ్ర అయోమయం నెలకొంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీడీపీలో నాలుగు సీట్ల పెండింగ్

జిల్లాలో టీడీపీ బలంగా వుంది. ఎన్నికల్లో విజయం తమదేనని సమరోత్సాహం ప్రదర్శిస్తోంది. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు గానూ పొత్తులో తిరుపతిని జనసేనకు కేటాయించి తాను ఏడు స్థానాలను అట్టిపెట్టుకుంది. ఈ ఏడింటిలో నగరికి గాలి భానుప్రకాష్, గూడూరుకు పాశం సునీల్ కుమార్, సూళ్ళూరుపేటకు నెలవల విజయశ్రీలను ఖరారు చేసిన అధిష్ఠానం మిగిలిన చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పెండింగులో వుంచింది. చంద్రగిరిలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నానీ ఇంచార్జిగా వున్నారు. పార్టీలో ఆయన్ను కాదని టికెట్ ఇతరులు అడిగే పరిస్థితి లేదు. గతేడాది యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ చంద్రగిరి నుంచీ నానీని గెలిపించాలని శ్రేణులకు, ప్రజలకు పిలుపిచ్చారు కూడా.అయినా అధికారికంగా నానీని అభ్యర్థిగా ప్రకటించలేదు. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంచార్జి. ఆయనకు లేదా ఆయన తల్లి లేదా భార్య... ఇలా కుటుంబంలోనే ఎవరో ఒకరికి టికెట్ దక్కుతుందని ఇతరులకు దక్కే పరిస్థితి లేదని శ్రేణులతో పాటు ప్రజలు కూడా విశ్వసిస్తున్నారు. అయినా ఇంతవరకూ పార్టీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు. సత్యవేడులో డాక్టర్ హెలెన్ ఇంచార్జి. ఆమె తల్లి మాజీ ఎమ్మెల్యే హేమలత ఇదివరకూ ఇంచార్జిగా వున్నారు. ఆమెకంటే ముందు జేడీ రాజశేఖర్ ఇంచార్జిగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య సైతం రేసులో వున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేరు కూడా పరిశీలనలో వుంది. వీరంతా కూడా బలమైన ఆశావహులే.వీరిలో ఎవరో ఒకరిని ఎంచుకుని టికెట్ ఖరారు చేయకుండా మీనమేషాలు లెక్కించడం శ్రేణుల్ని నీరసపరుస్తోంది. వెంకటగిరిలో ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి టీడీపీలో చేరారు. ఆయన మొన్నటి దాకా వెంకటగిరి టికెట్ ఆశించినా ఇపుడు ఆత్మకూరు నుంచీ పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో రామకృష్ణకు పెద్దగా పోటీ లేకుండా పోయింది. అయినా పార్టీ టికెట్ ఖరారు చేయకుండా పెండింగ్ వుంచింది. ఇలా నాలుగు సెగ్మెంట్లలో అభ్యర్థుల ఎంపిక పెండింగ్ పడడం పార్టీ శ్రేణుల్ని నిరుత్సాహానికి గురి చేస్తోంది.

జనసేన ఏకైక సీటులోనూ అభ్యర్థి ఎంపిక పెండింగ్

జిల్లాలో జనసేనకు తిరుపతి స్థానాన్ని కేటాయించింది టీడీపీ. అయితే ఆ పార్టీ నుంచీ బరిలో నిలవగలిగే అభ్యర్థి లేరు. ఇద్దరు నేతలున్నా వారిలో ఒకరికి ఆర్థిక వనరులు వున్నా కూడా ఎన్నికల్లో ధారాళంగా ఖర్చు పెట్టరన్న పేరుంది. మరొకరికి పోరాడే తత్వమున్నా ఆర్థిక వనరులు తగినంత లేవు. దీంతో ఈ ఇద్దరి పేర్లూ వెనుకబడ్డాయి. ఇటీవల జనసేనలో చేరిన చిత్తూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ రేసులో వున్నారు. అలాగే టీడీపీ నేత, వ్యాపారవేత్త గంటా నరహరి టికెట్ కేటాయిస్తే జనసేనలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అలాగే తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా టికెట్ ఇచ్చేటట్టయితే జనసేనలో చేరడానికి సుముఖంగా వున్నట్టు సమాచారం. ఈ ముగ్గురిలో పరిమితికి మించి ఆర్థిక వనరులు తెగింపుతో ఖర్చు పెట్టగలిగే నేతకు అవకాశం దక్కుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కాకపోతే అభ్యర్థి ఎంపికపై అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాల సమాచారం. పొత్తులో కేటాయించిన ఏకైక సీటులో ఈ సందిగ్ధత పార్టీ శ్రేణులను నిరుత్సాహ పరుస్తోంది.

బీజేపీ ఏ స్థానం కోరుతుందో తెలియని వైనం

జిల్లాలో పొత్తు కారణంగా టీడీపీ ఇప్పటికే తిరుపతి స్థానాన్ని జనసేనకు వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. కాకపోతే జనసేన, బీజేపీలకు కలిపి స్థానాలు కేటాయించినందున జనసేనకు కేటాయించిన తిరుపతి స్థానం నుంచీ తన అభ్యర్థిని బరిలోకి దింపుతుందో లేక బీజేపీకి వదిలిపెడుతుందో అంతుబట్టడం లేదు.బీజేపీ తిరుపతి కాకుండా శ్రీకాళహస్తి సీటు కోరితే టీడీపీ, జనసేన పార్టీల నిర్ణయమెలా వుంటుందో తెలియడం లేదు. తిరుపతి, శ్రీకాళహస్తి సీట్లపై ఈ పరిస్థితి మూడు పార్టీల్లోనూ అయోమయ పరిస్థితిని సృష్టిస్తోంది. ఎంత త్వరగా ఆయా పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు తీసుకుంటే ఆయా పార్టీల శ్రేణుల్లో తలెత్తిన అయోమయానికి అంత త్వరగా తెర పడనుంది.

అధికార పార్టీలోనూ మూడు సీట్లపై అయోమయం

అధికారం, అన్ని అనుకూలతలూ కలిగివున్న వైసీపీ కూడా జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. చంద్రగిరి, తిరుపతి, గూడూరు, సత్యవేడులకు సమన్వయకర్తలను ప్రకటించగా వారంతా అభ్యర్థులుగా ప్రచారంలో తలమునకలయ్యారు. వెంకటగిరికి ఏడాది ముందుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కోఆర్డినేటర్‌గా ప్రకటించినందున ఆయన కూడా ప్రచారం చేపట్టారు. అయితే సూళ్ళూరుపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విషయంలో పార్టీ డోలాయమానంలో వుంది. కిలివేటికే టికెట్ అని ఇతర నాయకులు చెప్పడమే తప్ప అధిష్ఠానం నుంచీ ప్రకటన లేదు. అలాగే శ్రీకాళహస్తిలో సిట్టింగ్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి కాకుండా టికెట్ కోరే ఇతరులెవరూ లేకపోయినా అధిష్ఠానం నుంచీ ఆయనకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. అలాగే నగరి నుంచీ మంత్రి రోజాకు కూడా అధిష్ఠానం నుంచీ టికెట్‌పై సంకేతాలు అందడం లేదు. నియోజకవర్గంలో ఆమెకు టికెట్ వద్దని అధికార పార్టీ నేతలే అధిష్ఠానంపై పోరుతున్నారు. దీంతో అక్కడ బరిలో ఆమే వుంటుందా లేక కొత్త అభ్యర్థి వస్తారా అన్నది అంతుబట్టక పార్టీ శ్రేణులు తికమకపడుతున్నారు.

కాంగ్రెస్‌లో మొదలు కాని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

రెండు నెలలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో హడావిడి మొదలైన సంగతి తెలిసిందే. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ షర్మిల తొలుత పార్టీ కార్యకర్తల సమావేశం తిరుపతిలో నిర్వహించగా తర్వాత తిరుపతిలోనే భారీ బహిరంగసభ జరిపారు. ఈ రెండింటితో పార్టీ అభిమానుల్లో జోష్ నింపినప్పటికీ అభ్యర్థుల ఎంపిక గురించి అసలు పట్టించుకోకపోవడంతో శ్రేణులు డీలా పడుతున్నాయి.



టీటీడీ పాలకమండలి సమావేశం

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి నివేదిక

టీటీడీ పాలకమండలి నిర్ణయం

తిరుమల, మార్చి11(ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్, రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌వోఆర్) ద్వారా కాకుండా టీటీడీ బోర్డు ఆమోదంతో 2014కు ముందు తీసుకున్న కాంట్రాక్ట్, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని నిర్ణయించినట్టు టీటీడీ చైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు.తిరుమలలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. టీటీడీలో ఐటీ సేవల కోసం టైర్ 3 డేటా సెంటర్, డిజాస్టర్ రికవరీ సెంటర్ ఉన్నాయని, ఐటీ స్టాండర్డ్ ప్రొటోకాల్ ప్రకారం ఏడేళ్లకు ఒకసారి టెక్ రీప్లేస్‌మెంట్ చేయాలన్నారు. ఇందులో భాగంగా ఐదేళ్ల పాటు డేటా సెంటర్ల నిర్వహణ కోసం రూ.12 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో 15 చారిత్రాత్మక, పురాతన ఆలయాలు, టీటీడీ నిర్మించిన 13 ఆలయాలు, ఆధీనంలోకి తీసుకున్న 22 ఆలయాల్లో అభివృద్ధి పనులను శ్రీవాణిట్రస్టు నిధుల ద్వారా చేపట్టేందుకు ఆమోదం తెలిపామన్నారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని భాష్యకార్ల సన్నిధిలోని మకర తోరణానికి, పార్థసారథి స్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరువాభరణాలకు బంగారు పూత పూసేందుకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. స్విమ్స్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో 479 నర్సు పోస్టులు క్రియేట్ సేందుకు తీర్మానం చేశామన్నారు.శ్రీవారి ఆశీస్సులతో మంగళసూత్రాలను భక్తులకు విక్రయించేందుకు తయారీ కోసం పలు సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తిరుమలలోని టీటీడీ ఉద్యోగుల పాత సీ టైప్, డీ టైప్, కొత్త సీ టైప్, డీ టైప్ క్వార్టర్స్‌లో మిగిలి ఉన్న 184 క్వార్టర్స్ అభివృద్ధి పనులకు రూ.14 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.టీటీడీ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించడం కోసం అవసరమైన భవనాల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. రూ.1.88 కోట్లతో తిరుమలలో భక్తుల సౌకర్యార్థం పీఏసీ1లో 10 లిఫ్టుల ఏర్పాటుకు టెండరు ఆమోదించామన్నారు.రూ.1.50 కోట్లతో బాలాజీనగర్ తూర్పువైపున, పద్మావతి విశ్రాంతి భవనం ఔటర్ కార్డన్ ప్రాంతంలో మిగిలిపోయిన ఫెన్సింగ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఘాట్ రోడ్డులో మరణించిన తిరుమల ఆలయ పరిచారకుడు యతిరాజన్ నరసింహన్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు.ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక శ్రీవారి దర్శనానికి రాజకీయ ప్రముఖుల సిఫార్సు లేఖలను స్వీకరించకూడదని తీర్మానం చేసినట్టు సమాచారం. ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పించాలనుకున్నట్టు తెలిసింది.

నేటినుంచి రంజాన్ దీక్షలు

సత్యవేడు, మార్చి 11: ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభమైంది. ఈ నెల ప్రారంభాన్ని సూచించే నెలవంక సోమవారం సాయంత్రం దర్శనమివ్వడంతో మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి.ఈ నెలలో ముస్లింలు తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకు కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు. మసీదుల్లో ఐదువేళలా ప్రార్థనలతో పాటు పవిత్ర తరావీహ్ నమాజు, ఖురాన్‌లను పఠిస్తారు.నెలవంక తిరిగి దర్శనమిచ్చేంతవరకూ ఈ ఉపవాస దీక్షలను పాటిస్తారు.గల్ఫ్ దేశాల్లో నెలవంక ఆదివారం దర్శనమివ్వగా సోమవారం నుంచి దీక్షలు ప్రారంభం కాగా భారతకాలమానం ప్రకారం వివిధ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 6.40 నుంచి 6,52 గంటల వరకు నెలవంక దర్శనమిచ్చింది.



తిరుపతి కలెక్టరేట్ వద్ద పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆందోళన

సర్పంచుల పోరుబాట

పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11: ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచులు పోరుబాట పట్టారు. తమ 16డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారీ ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.జగన్ ఓడితేనే మన మనుగడ అనే నినాదంతో అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి కృషి చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన విధులు, నిధులు దోచేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించండని కోరుతూ సర్పంచులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు.పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్ మాట్లాడుతూ సర్పంచులకు తెలియకుండా వారి ఖాతాల్లో నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని... దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను ఓడించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించే సీఎంను ఎన్నుకుందామన్నారు. సిద్ధం అనే నినాదంతో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్ గడచిన మూడేళ్లుగా సర్పంచుల ఆందోళన చేస్తుంటే చర్చలకు మాత్రం సిద్ధం కాలేదని విమర్శించారు.సర్పంచుల సంఘం 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రతాపరెడ్డి, ప్రకాష్‌నాయుడు, చింతా కిరణ్‌యాదవ్, జనార్దన గౌడ్, రాము, మురళి, కొత్తపు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పులికాట్ పూడికతీత' మళ్లీ వాయిదా

తడ, మార్చి 11: పులికాట్ పూడికతీత శంకుస్థాపన మళ్లీ వాయిదా పడింది. పులికాట్ సరస్సు పూడిక తీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 97.09 కోట్ల వ్యయంతో ఈ పనులు చేయాలని నిర్ణయించారు. అందుకు అవసరమైన అనుమతులను పొందారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి మరికొన్ని అనుమతులు రావాల్సి ఉన్నట్లుగా ప్రచారంలో ఉంది. దాంతోపాటు ఈపనులకు టెండర్ల ప్రక్రియ వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవేమీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో హఠాత్తుగా ఈ పనులకు శ్రీకారం చుట్టేందుకు నిర్ణయించారు. గత ఏడాది నవంబరు 21వ తేదీ సీఎం జగన్ చేతులమీదుగా శంకుస్థాపన అంటూ హడావుడి చేశారు. ప్రకృతి కరుణించకపోవడంతో అప్పట్లో అది వాయిదా పడింది. మళ్లీ మూడున్నర నెలలపాటు ఈ విషయం పక్కన పెట్టేశారు. మరో రెండు, మూడ్రోజు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో ఈ విషయం మరోసారి తెరపైకివచ్చింది. అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం శంకుస్థాపనను సీఎం వర్చువల్‌గా చేస్తారంటూ సోమవారం తడలో ఏర్పాట్లు చేసే పనిలోపడ్డారు. ఏమైందో ఏమో కానీ మధ్యాహ్న సమయానికి ఇది కూడా వాయిదాపడింది. త్వరలోనే సీఎం ఈ పనులకు శంకుస్థాపన చేస్తారంటూ అధికారులు ప్రకటించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



వెంకటగిరి/వెంకటగిరి టౌన్, మార్చి 11: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ సంఘమేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో కేంద్ర, పోలీసు బలగాలు కవాతు నిర్వహించి, తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



గూడూరు, మార్చి 11: తూర్పువీధిలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బెంచీలను సోమవారం వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్ కుమార్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్‌బాబు, తాళ్లూరు శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, గిరిబాబు, సిద్దారెడ్డి, రవిచంద్ర, హెచ్ఎం రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత చెక్ పంపిణీ



లబ్ధిదారులకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు

గూడూరు అర్బన్: మార్చి 11: ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని లబ్ధిదారులైన మహిళలకు వైఎస్సార్ చేయూత మెగా చెక్‌ను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రావు పంపిణీ చేశారు. నాల్గవ విడత కింద 3728 మంది మహిళలకు రూ.6.99 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పూటుకూరు యామిని, ఎంపీపీ గురవయ్య, పూటుకూరు మహేంద్ర రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోండి: సీపీఐ



మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సీపీఐ నేతల ధర్నా

వెంకటగిరిటౌన్, మార్చి 11: చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పల్లిపాటి బాల కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 600 ఎకరాల చెరువుల భూములను కబ్జా చేసి, అమ్మకాలు చేస్తున్నారని చెప్పారు. వీరికి ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోకుంటే మహా ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. వడ్డిపల్లి చెంగయ్య, అంకయ్య, మునేద్ర, సాయికుమార్, అజయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

నాయుడుపేట టౌన్, మార్చి 11: పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం నీలకంఠేశ్వరస్వామి వార్లకు స్వర్ణముఖినదిలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్ రెడ్డి, ఉగ్గుముడి భాస్కర్‌రెడ్డి, బాలాజీ స్వామి, అవధానం సుధీర్, అంకయ్య, ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు నేదురుమల్లి విగ్రహావిష్కరణ

వాకాడు, మార్చి 11: మండలంలోని స్వర్ణముఖీ నదీ తీరంలో బుధవారం మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తన తండ్రి విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ముఖ్య అతిథిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మేరిగ మురళీధర్, కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలిచేది టీడీపీయే



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 11: బీసీలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని బీసీ సెల్ నాయకుడు బిల్లు చెంచురామయ్య అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీలకు చంద్రబాబునాయుడు ప్రకటించిన వరాలపై సమావేశం నిర్వహించారు. బీసీలందరూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఇశ్రాయిల్‌కుమార్, చక్రవర్తి, మురళి, కళ్యాణ్, మధుసూదన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు



చంద్రగిరి, మార్చి 11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముంగ్లారి బాలకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రయాణికులు సురక్షితం



కోట, మార్చి 11: విద్యానగర్ బాలభారతీ పాఠశాల సమీపంలో సోమవారం రాత్రి ఒక కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు స్వల్పంగా దెబ్బతినగా.. అందులోని నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా వాకాడు మండలానికి చెందినవారని సమాచారం.

స్వపక్షమే విపక్షమై..!

నాయుడుపేట మున్సిపల్ సమావేశంలో ప్రశ్నలు సంధించిన వైసీపీ కౌన్సిలర్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న దీపిక

నాయుడుపేట, మార్చి 11: స్వపక్షమే విపక్షమైంది. నాయుడుపేటలో సోమవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు పలు ప్రశ్నలను సంధించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఆరో వార్డు కౌన్సిలర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అందరు కౌన్సిలర్లకు రూ.10లక్షల వంతున అభివృద్ధి పనులకు కేటాయించి, తనకు మాత్రం రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎన్నికలకు పోలేమన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి మాట్లాడుతూ.. తన వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కరించేదెప్పుడని ప్రశ్నించారు. నామినేషన్ ప్రకారం అనుమతిస్తే తానే పనులు చేసుకుంటానని చెప్పారు. పట్టణం అంతా గ్యాస్‌పైపులైన్ల నిర్మాణంతో సిమెంట్ రోడ్లన్నీ ధ్వంసమైపోయాయని.. మరమ్మతులు ఎప్పుడు చేస్తారన్నారు. మున్సిపాలిటీ విలువైన ప్రాంతాల్లో ప్రైవేట్ ఏటీఎంలకు విచ్చలవిడిగా అనుమతులు ఎవరిచ్చారని, పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కోఆప్షన్ మెంబరు చదలవాడ కుమార్ కోరారు. అలాగే మొదటి అంతస్తులోని 28 దుకాణాల అద్దెలు రూ.4,100 నుంచి రూ.2వేలకు తగ్గించాలన్నారు. ఛైర్ పర్సన్ మాట్లాడుతూ. అందరి సమస్యలను అజెండాలో చేరుస్తామని చెప్పారు.

ఆదరించండి.. ఇంటి పెద్ద బిడ్డగా కష్టాలు తీరుస్తా

- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 11: రానున్న ఎన్నికల్లో తనను ఆదరించాలని ఇంటి పెద్ద బిడ్డగా మారి కష్టాలను తీరుస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. పట్టణంలో టీడీపీ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిందేమీ లేదని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్‌నాయుడు, కాపా శ్రీనివాసులునాయుడు, కొప్పవరపు చెంగారావు, అవ్వారు సత్యనారాయణ, మల్లారం బాబు, సుధా, తాండవ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రం: పాశిం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశిం సునీల్‌కుమార్, టీడీపీ నేతలు

చిల్లకూరు, మార్చి 11: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం చింతవరం గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటిప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని మరచి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. విద్యుత్, బస్సు చార్జీలు, నిత్యావసరాల ధరలను పెంచడంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాలని చెప్పారు. సన్నారెడ్డి వెంకటరమణా రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, చిరంజీవి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, అన్నం మునిశేఖర్‌గౌడ్, సుప్రజ, వెంకటేశ్వర్లు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

గూడూరు: టీడీపీ కార్యాలయంలో సోమవారం మండలంలోని రెడ్డిగుంట గ్రామానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. వైసీపీ అరాచక పాలనను తట్టుకోలేక ప్రజలు స్వచ్ఛందంగా అభివృద్ధిని కాంక్షించే టీడీపీలోకి చేరుతున్నారని పాశిం అన్నారు. వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, పద్మనాభరెడ్డి, సురేష్‌రెడ్డి, రాఘవులు, రాధాకృష్ణారెడ్డి, మురళీనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి పలు రైళ్ల రద్దు

తిరుపతి సెంట్రల్, మార్చి11 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనుల కారణంగా సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

- పాండిచ్చేరి-తిరుపతి మధ్య నడుస్తున్న (16112-16111)రైళ్లను ఈనెల 24వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-మంగళూరు మధ్య నడుస్తున్న వారాంతపు రైలును (174070) ఈనెల 15 వరకు రద్దు చేశారు.
- తిరుపతి-అరక్కోణం మధ్య నడిచే (06753-06754), చెన్నై-తిరుపతి మధ్య నడుస్తున్న (06728-06727) ప్రత్యేక రైళ్లను తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 14వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-చెన్నై మధ్య నడుస్తున్న రోజువారి ఎక్స్‌ప్రెస్‌లు(16057-16058, 16054-16053) 23వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నాలుగు రైళ్లు రేణిగుంట-చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.
- నిజాముద్దీన్-త్రివేండ్రం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(12644) ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు తిరుపతికి రాకుండా రేణిగుంట నుంచి అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(12646) మంగళవారం నుంచి 19వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- బెంగళూరు నుంచి టాటానగర్, హటియాల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు 21వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తాయి.
- కాచిగూడ-మదురై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07191) ఈ నెల 18వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తుంది.

రోజాకు సీటిస్తే ఓడిస్తాం

- వైసీపీ నేతల హెచ్చరిక



కరపత్రాలు చూపుతున్న వైసీపీ నేతలు

తిరుపతి సిటీ, మార్చి 11 : నియోజకవర్గ అభివృద్ధిని పక్కన పెట్టి, అన్నదమ్ములను అడ్డం పెట్టుకుని మంత్రి రోజా అక్రమ సంపాదనకు తెరలేపారని, పార్టీ నేతలకు అండగా ఉండకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైసీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మురళి ఆరోపించారు. నగరి నియోజకవర్గంలోని వైసీపీ నేతలతో కలిసి ఆయన సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎంతో శ్రమించి ఆమెను ఎమ్మెల్యేగా గెలిపించామని, అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలనే ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. చిన్న పని కోసం అధికారుల దగ్గకు వెళ్లినా 'మంత్రి గారిని లేదా వాళ్ల అన్నదమ్ములను కలవండి.. వారు చేప్తేనే చేస్తాం' అని చెబుతున్నారని వాపోయారు. రోజా అన్నదమ్ములను కలిస్తే డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కాయంగుట్ట పంచాయతీలో జగనన్న కాలనీ పేరుతో గ్రావెల్ తరలించి రూ.కోట్లు సంపాదించిన విషయం నియోజకవర్గంలో ఎవర్ని అడిగినా చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమెకు సీటు ఇస్తే ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జయచంద్రారెడ్డి, మునీంద్ర పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై సదస్సు

తిరుపతి(రూరల్), మార్చి 11: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 14, 15 తేదీల్లో తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. జాతీయ తేనెటీగల పెంపకం, తేనెమిషన్ పథకంలో భాగంగా ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల జాతీయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈసదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. తేనెటీగల పెంపకంలో మెలకువలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహనతోపాటు నిష్ణాతులైన రైతులు తమ అభిప్రాయాలను పంచుకుంటారని వివరించారు. ప్రదర్శనలు కూడా ఉంటాయని ఔత్సాహికులైన విద్యార్థులు, మహిళలు, అంకుర సంస్థలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలిక అపహరణకు యువకుడి యత్నం

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

కోట, మార్చి 11 : ఓ బాలిక అపహరణకు యత్నించిన యువకుడిని పట్టుకుని స్థానికులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. చెందోడు పంచాయతీలో ఎనిమిదేళ్ల బాలికను మద్యం మత్తులోని ఓ యువకుడు అపహరించడానికి యత్నించారు. అక్కడున్నవారు గమనించి కేకలు వేయడంతో పరుగుతీశాడు. స్థానికులు వెంబడించి అతడిని పట్టుకుని దేహశుద్ధిచేసి.. పోలీసులకు అప్పగించారు. కోట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

మసీదు వద్ద సంబరాలు



గూడూరు అర్బన్, మార్చి 11: నెలవంక కనిపించడంతో పెద్దమసీదు వద్ద సోమవారం ముస్లింలు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం నుంచి నెల పాటు రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభమవుతాయని ముస్లింలు తెలిపారు. దీంతో పెద్దమసీదును విద్యుద్దీపాలతో అలంకరించారు.

వేమిరెడ్డికి సన్మానం



నాయుడుపేట, మార్చి 11 : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గ పరిస్థితులు వివరించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



హేమచంద్రారెడ్డిని సన్మానిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థులకు విధిగా బోధించి వారి ప్రతిభకు మెరుగులుదిద్దే విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనాంశంగా మారడమే నిదర్శనమని అన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామమన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ ఈ అంశంపై అర్థవంతమైన చర్చ సాగి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏకి చెందిన జినామిక్స్ బయోటెక్ ప్రతినిధి అలోక్ పాండే, మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి హసీనా కరీమా, సదస్సు నిర్వాహకులు ఉష, భార్గవి పాల్గొన్నారు.

చింతపూడిలో తాగునీటి ఎద్దడి

పెళ్లకూరు, మార్చి 11: చింతపూడి పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. తాగునీటిని అందించే మోటర్ మరమ్మతులకు గురవడంతో మహిళలు సమీప వ్యవసాయ బోర్ల వద్దకెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్‌ను వివరణ కోరగా.. బుధవారం తాగునీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు

- సర్పంచుల ఆవేదన



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

చిట్టమూరు, మార్చి 11: ప్రజాసేవ చేయాలని వస్తే తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారని అధికార పార్టీకి చెందిన పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్త్రీ సంక్షేమ భవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు ప్రసంగించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ విజయలక్ష్మి కోరారు. వైస్ ఎంపీపీ రమణయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం అందిస్తున్న ఉచిత గ్యాస్ కనెక్షన్‌లలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. వీటిని లబ్ధిదారులకు సర్పంచుల ద్వారా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, జట్పీటీసీ వెంకటయ్య, డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన జగన్

- సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల



వేదికపై నెలవల, పరసారత్నం, విజయశ్రీ, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, మార్చి 11 : సీఎం జగన్ తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, జనాన్ని మోసం చేశారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలులో సోమవారం రాత్రి టీడీపీ అభ్యర్థి విజయశ్రీ పరిచయ వేదికలో మాజీమంత్రి పరసా వెంకటరత్నంతో కలసి పాల్గొన్నారు. నెలవల మాట్లాడుతూ.. రాష్ట్రంలో నడుస్తున్న అరాచక పాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధం ద్వారా గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అభ్యర్థి విజయశ్రీని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి.. అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కామిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులునాయుడు, ఆకుతోట రమేష్, పేరంశెట్టి శ్రీరామ్ ప్రసాద్, కట్టా వెంకటరమణారెడ్డి, 786 రఫీ, సుజాతమ్మ, గంగాప్రసాద్, దార్ల రాజేంద్ర, నెలవల రాజేష్, అప్పాడి సుబ్బరాయుడు, పరసా రాజా, గోనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



సూళ్లూరుపేటలో ధ్రువపత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న కిలివేటి

దొరవారిసత్రం, మార్చి 11: దొరవారిసత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందజేశారు. మండలంలో 39 లేవుట్‌ల్లో 554 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, తహసీల్దారు ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో శివరాజు, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తడ, సూళ్లూరుపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఆర్డీవోతోపాటు తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీలో నిర్లక్ష్యం వీడండి



సభ్యురాలికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీసీ, ఏపీఎం

కోట, మార్చి 11 : స్త్రీనిధి రుణాల రికవరీలో నిర్లక్ష్యం వీడాలని వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎంచేమూరి రత్నయ్య హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వీవోఏలు, సీసీలతో ఈ అంశంపై సమీక్షించారు. ఈనెల 24వ తేదీలోపు రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. వెనుకబాటు వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రుణాలు సకాలంలో చెల్లించిన సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సీసీలు కృష్ణమ్మ, భాస్కర్, శంకరయ్య, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం



కోట, మార్చి 11 : విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పలు పోటీల్లో విజేతలైన విద్యార్థినులు, అధ్యాపకులకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా వివిధ పోటీలు నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు అపోలో వైద్యాధికారి డాక్టర్ రష్మి రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఇందుమతి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో రూ.6లక్షల చోరీ



తొలగించిన దుకాణం రేకులు

గూడూరు, మార్చి 11: మండలంలోని కొండాగుంటలో ఉన్న మద్యం దుకాణంలో రూ.6లోల చోరీ జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం దుకాణంపై ఉన్న రేకులు తొలగించి, లోనికి ప్రవేశించారు. అనంతరం దుకాణంలోని రూ.6లక్షలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం దుకాణాన్ని సిబ్బంది తెవరగా, చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేత కుటుంబానికి పరామర్శ

బాలాయపల్లి, మార్చి 11: కామకూరుకు చెందిన వైసీపీ నాయకుడు కూని రామయ్య తమ్ముడు వెంకటేశ్వర్లు కుమారుడు శివబాబ్జీ ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబీకులను వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచంద్ర సోమవారం పరామర్శించారు. ఆయనవెంట కూను పరంధామయ్య, కూను శ్రీను, దాసరి అశోక్ తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నాయుడుపేట, మార్చి 11: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేట ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం కొంతమంది ముస్లింలు వైసీపీలో చేరారు. కౌన్సిలర్ షబ్బీర్, జిలానీ, రఫీ, మాబాషా, సలామ్, ఖాదర్‌బాషా, రియాజ్ తదితరులున్నారు.

మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



కరపత్రాలు పంపిణీ చేసిన సంధ్యారాణి

గూడూరు, మార్చి 11: మహిళా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం విష్ణేశ్వరపురం ప్రాంతంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఓంప్రకాష్, మణికంఠ, ఉదయ్, బత్తిన ప్రణీత్, బాలు, రఘు, శ్రీకాంత్, సందీప్, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.